ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
బుధవారం 19 మార్చి 2025


రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధవారం సాయంత్రం)		సెహరీ (గురువారం ఉదయం)
రాయచోటి	6.30	4.59
మదనపల్లె	6.32	5.05
రాజంపేట	6.28	5.07
పీలేరు	6.30	4.58

ఒంటిమిట్ట కోదండరామాలయం



కోదండ రామాలయానికి

పర్యాటక శోభ

- ఒంటిమిట్ట కేంద్రంగా టూరిజం హబ్ ఏర్పాటు
- చెరువులో బోటు షికారు
- మండలిలో మంత్రి కందుల దుర్గేశ్ వెల్లడి

రాజంపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర భద్రాద్రిగా గుర్తింపు పొందిన ఒంటిమిట్ట కోదండరామాలయాన్ని ఆధ్యాత్మిక కేంద్రంతో పాటు దేశంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. శాసనమండలిలో మంగళవారం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ మాట్లాడుతూ ఒంటిమిట్ట ఆధ్యాత్మిక కేంద్రంగా చుట్టూ ఉన్న ఆలయాలను కలిపి టూరిజం హబ్‌గా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఒంటిమిట్ట కేంద్రంగా రాయలసీమలోని ప్రధాన ఆలయాలైన దేవుని కడప, పుష్పగిరి, బ్రహ్మంగారిమఠం, గండిక్షేత్రం, యాగంటి, నందవరం, మహానంది తదితర ప్రధాన ఆలయాలన్నింటిని కలుపుతూ టూరిజం హబ్‌గా అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు. ఒంటిమిట్ట ప్రధాన ఆలయానికి ఆనుకుని ఉన్న ఒంటిమిట్ట చెరువులో శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరించి నీటిని నింపి ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసేటట్లు ట్యాంక్‌బండ్ రీతిలో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయనున్నారు. ఒంటిమిట్టలో ఉన్న హరిత రెస్టారెంట్‌ను ఆధునీకరించి మరికొన్ని ఏర్పాట్లు చేయనున్నారు. ప్రస్తుతం ఒంటిమిట్ట కోదండరామాలయం టీటీడీ ఆధీనంలో నడుస్తోంది. టీటీడీ నిధులతోనే అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. అయితే రాష్ట్ర పర్యాటక మంత్రి ప్రకటన ప్రకారం కేంద్ర పర్యాటకశాఖ మంత్రి గజేంద్ర షెకావత్ ఆధ్వర్యంలో కేంద్ర నిధులను విడుదల చేయించి ఆ నిధులతో రాష్ట్ర ప్రభుత్వం నిధులను జోడించి ఒంటిమిట్టలో అనేక పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నారు. కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల పర్యాటకులు ఒంటిమిట్టకు వచ్చినప్పుడు ఈ ఆలయ ప్రాధాన్యతను, చుట్టుపక్కల ఆలయాల ప్రత్యేకతను తెలుగుతో పాటు ఇంగ్లీషు, తమిళం, హిందీ తదితర భాషల్లో పర్యాటకులకు తెలియజేయడానికి అందుకు సంబంధించిన గైడ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఏప్రిల్‌లో కోదండరాముడి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా కల్యాణోత్సవానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలతో హాజరు కానున్నారు. ఈ సమయంలో దీనిపై స్పష్టమైన ప్రకటన వెలువడనుంది. అనంతరం ఒంటిమిట్ట చుట్టుపక్కల ప్రధాన ఆలయాలను ఆధ్యాత్మిక కేంద్రాలతో పాటు పర్యాటక కేంద్రాల హబ్‌గా అభివృద్ధి పనులు చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టనున్నట్లు తెలుస్తోంది.

ట్యాంక్‌బండ్ తరహాలో అభివృద్ధి కానున్న ఒంటిమిట్ట చెరువు



పుట్టిన రోజు నాడే...

- సినిమాకు వెళ్లి వస్తూ అనంతలోకాలకు...
- గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకుల మృతి
- పెద్దతిప్పసముద్రం ఎస్సీ కాలనీలో విషాదం




శ్రీనివాసులు, చందు మృతదేహాలు



శ్రీనివాసులు, చందు (ఫైల్)

పెద్దతిప్పసముద్రం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఆ యువకులిద్దరూ దగ్గరి బంధువులు.. మంచి స్నేహితులు. సోమవారం శ్రీనివాసులు అనే యువకుడిది పుట్టినరోజు కావడంతో స్నేహితులు, బంధువులు అందరితో కలిసి సాయంత్రం సంతోషంగా గడిపాడు. తనకు బంధువు, ప్రాణ స్నేహితుడైన చందుతో కలిసి సెకండ్‌షో సినిమాకు వెళ్లి.. తిరిగి అర్ధరాత్రి ద్విచక్ర వాహనంలో గ్రామానికి వస్తుండగా గుర్తు తెలియని వాహనం రూపంలో వారిద్దరినీ మృత్యువు కబళించింది. పీటీఎం పోలీసుల వివరాల మేరకు.. పీటీఎంలోని ఎస్సీ కాలనీకి చెందిన దండు శంకర కుమారుడు శ్రీనివాసులు (22), సాదిలి గంగాద్రి కుమారుడు చందు (22) సోమవారం రాత్రి బి.కొత్తకోటకు సినిమాకు వెళ్లారు. సెకండ్ షో సినిమా చూసిన అనంతరం అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో బి.కొత్తకోట నుంచి పీటీఎంకు ద్విచక్రవాహనంలో తిరుగు ప్రయాణమయ్యారు. పీటీఎం-బి.కొత్తకోట మార్గంలోని వెంకటేశ్వర కోళ్ల ఫారం సమీపంలో గుర్తు తెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసులు అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడ్డ చందును 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. సమాచారాన్ని అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ హరిహరప్రసాద్ తెలిపారు. కాగా ఒకే కాలనీకి చెందిన ఇద్దరు యువకులు మృతి చెందడం.. పైగా పుట్టినరోజు నాడే మృత్యువాతపడటంతో శ్రీనివాసులు కుటుంబ సభ్యులు, స్నేహితులు భోరున విలపించారు. రెండు కుటుంబాలకు చేదోడుగా ఉంటారనుకున్న యువకులు అకస్మాత్తుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చినబాబు, బాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పీటీఎం శివప్రసాద్, పార్లమెంట్ జనరల్ సెక్రటరీ కట్టా దొరస్వామినాయుడు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

రీసర్వే సమర్థవంతంగా పూర్తి చేయాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



బూడిదవేడులో రీసర్వే ప్రక్రియను తనిఖీ చేస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

వాల్మీకిపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వే ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. మంగళవారం వాల్మీకిపురం మండలంలోని బూడిదవేడు గ్రామంలో జరుగుతున్న రీసర్వే ప్రక్రియను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రీసర్వే సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రెవెన్యూ అధికారులతో మాట్లాడుతూ రీసర్వే ప్రక్రియ మరింత వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టా భూములు, ప్రభుత్వ, అసైన్డ్ భూములు తదితరం అన్నింటిలో కూడా సమగ్రంగా సర్వే పూర్తి చేయాలని ఎప్పటికప్పుడు వివరాలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామంలో 2028 ఎకరాల భూములు ఉన్నాయని జనవరి 20వ తేదీ సర్వే ప్రక్రియ ప్రారంభించి ఇప్పటి వరకు వెయ్యి ఎకరాల భూమి రీసర్వే చేశామని తహసీల్దార్ పామిలేటి కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో సర్వేయర్ పూర్ణచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిలో పోలీసుల కవాతు

రాయచోటిటౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో మంగళవారం బాధ్యతలు చేపట్టిన అర్బన్ సీఐ వెంకటచలపతి ఆధ్వర్యంలో పోలీసులు పట్టణంలో కవాతు చేశారు. రాయచోటి పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా అర్బన్ పోలీసుల ఆధ్వర్యంలో పోలీసు బృందం పట్టణంలోని ప్రధాన రహదారుల్లో కవాతు చేస్తూ ప్రజలకు శాంతిభద్రతలపై అవగాహన కల్పించారు. ఎటువంటి సమస్యలు లేకుండా ప్రశాంత వాతావరణంలో జీవించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో అర్బన్ ఎస్‌ఐ జహీర్, సిబ్బంది పాల్గొన్నారు.



రాయచోటి పట్టణంలో కవాతు చేస్తున్న పోలీసులు

వైభవంగా కల్యాణం



స్వామి వారి కల్యాణం చేస్తున్న అర్చకులు

గుర్రంకొండ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తరిగొండ లక్ష్మీనరసింహస్వామి కల్యాణాన్ని టీటీడీ వేదపండితులు మంగళవారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున టీటీడీ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించడం అనవాయితీ. ఇందులో భాగంగా ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శ్రీదేవి, భూదేవిలతో స్వామి వారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.

'అతుకుబడి'తో తంటా..!

అతుకుబడి పట్టా... ఈ పేరు దాదాపు ఎవరూ విని ఉండరు. రైతుల పట్టాదారు పాస్‌పుస్తకాల్లో అతుకుబడి అనే పేరు జిల్లాలోని రైల్వేకోడూరు నియోజకవర్గంలో కొత్తగా వినిపించింది. ఎలా జరిగిందో తెలియదు గాని రైతు పాస్‌పుస్తకాలను ఆన్‌లైన్ చేసే క్రమం లో రైల్వేకోడూరు రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న ఓ కంప్యూటర్ ఆపరేటర్ 2012లో అతుకుబడి అనే పేరును నమోదు చేసి రైతు పట్టాదారు పాసుపుస్తకాల్లో ముద్రించారు.

- రిజిస్ట్రేషన్‌కు నోచుకోని భూములు
- రైల్వేకోడూరులోనే 17 వేల పట్టాలు
- జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో ముమ్మరంగా కసరత్తు
- సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు

రైల్వేకోడూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రాగానే భూముల సర్వేపై రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త నిబంధలనతో ఈ అంశం తెరపైకి వచ్చింది. దీంతో రెవెన్యూ అధికారులు అతుకుబడి భూముల పై ప్రక్రియ ప్రారంభించారు. అతుకుబడి అని పట్టాదారు పాసు పుస్తకాలలో ఉంటే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో పలువురు రైతులు ఇబ్బందులు పడ్డారు. రైతు పట్టాదారు పాస్‌పుస్తకాల్లో జిరాయితీ అని ఉంటేనే రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. అతుకుబడి ఉంటే చేయడం లేదని ఇటు ప్రభుత్వానికి, అటు అధికారులకు రైతులు వినతులు ఇవ్వడం



రైల్వేకోడూరు రెవెన్యూ కార్యాలయంలో ఫ్రీహోల్డ్‌పై నివేదికలు తయారు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

తో ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. అతుకుబడి అని ఉంటే భూమి ఆన్‌లైన్ కరెక్షన్స్ కూడా చేయలేని పరిస్థితి ఏర్పడింది. గతంలో రైతుల పట్టాదారు పాస్ పుస్తకాల్లో అతుకుబడి, జిరాయితీ అనే పేర్లు లేవు. సాధారణంగా రైతు పాసు పుస్తకాల్లో భూమి సర్వే నెంబర్లు, విస్తీర్ణం, డీకేటీ అయితే డీకేటీ, పట్టా అయితే పట్టా ఇలా ఉండేవి. మళ్లీ పట్టాదారు పాస్ పుస్తకాల్లో రాజముద్రలు, స్టిక్కర్లు తదితరాల్లో రెవెన్యూ శాఖ మార్పులు తీసుకొచ్చింది. ఇవి ఉంటేనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో క్రయవిక్రయాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు జరిగేవి. ప్రస్తుతం రైతు పట్టాదారు పాసుపుస్తకాల్లో అతుకుబడి, జిరాయితీ అనే పదాలు కొత్తగా వినిపిస్తున్నాయి. ఇవి ప్రత్యేకించి రైల్వేకోడూరు నియోజకవర్గం లోనే ఉండటం విశేషం. దీంతో ఇటు అధికారులు, రైతులు తలలు పట్టుకున్నారు. రెవెన్యూ సదస్సుల్లో అత్యధికంగా అతు కుబడి పట్టాలు ఉన్న రైతులు తమకు విముక్తి కల్గించాలని విన్నపాలు చేసుకున్నారు. రెవెన్యూశాఖ దీనిపై ప్రభుత్వానికి నివేదిక పంపింది. దీంతో ప్రభుత్వం వెంటనే చర్యలు ప్రారంభించింది. రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడింది. జిల్లాలో ఎక్కడా లేనిది ఒక్క రైల్వేకోడూరు నియోజకవర్గంలోనే అతుకుబడి పట్టాలు ఉన్నాయని అధికారులు గుర్తించారు. దీనిని జిరాయితీగా ఎలా మార్చాలని



ఆన్‌లైన్‌లో కనిపిస్తున్న అతుకుబడి పట్టా

ప్రభుత్వం అధికారులతో చర్చించింది. సాధ్యాసాధ్యాలను జాయింట్ కలెక్టర్ పరిశీలించి రైల్వేకోడూరు తహసీల్దార్‌కు నివేదిక త్వరితగతిన ఇవ్వాలని ఆదేశించడంతో అతుకుబడి పట్టాల నివేదికలు కలెక్టర్ కార్యాలయానికి పంపారు. అతుకుబడి లేకుండా జిరాయితీ అనే పదంతో క్రయవిక్రయాలు జరిగే విధంగా జాయింట్ కలెక్టర్ ప్రత్యేకంగా చర్యలు తీసుకున్నారు. దీంతో త్వరలో రైతులకు తీపి కబురు రానుంది.

అతుకుబడి పట్టాలకు త్వరలోనే మోక్షం



అతుకుబడి పట్టాలకు త్వరలోనే మోక్షం లభిస్తుంది. భూముల క్రయవిక్రయాలు జరిగేందుకు వీలుగా తీసుకునే చర్యల్లో భాగంగా ఫ్రీహోల్డ్ భూములను గుర్తిస్తోంది. జిల్లా అధికారులు దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. దీంతో మేం కూడా ఫ్రీహోల్డ్ భూములపై నివేదికలు తయారు పంపాం.

- మహబూబ్ చాంద్, తహసీల్దార్, రైల్వేకోడూరు



రీసర్వేపై రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రీసర్వే పక్కాగా చేయండి

● అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్

గుర్రంకొండ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వే పక్కాగా చేయాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ రెవెన్యూ సిబ్బందికి సూచించారు. గుర్రంకొండ తహసీ ల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో ఆయన మాట్లాడుతూ మండలంలో ఎన్ని వేల ఎకరాల భూములున్నాయి. అందులో డ్రై ల్యాండ్ ఎంత...? వెట్ ల్యాండ్ ఎంత? ఎన్ని గ్రామాల్లో రీ సర్వే చేస్తున్నారు, ఇప్పటి వరకు ఎన్ని ఎకరాల్లో సర్వే చేశారని తహసీల్దార్‌ని అడిగి వివరాలు సేకరించారు. మండలంలో 3,356 ఎకరాల్లో సర్వే చేయాల్సి ఉండగా, మూడు టీములు ఏర్పాటు చేసి రోజుకు 60 ఎకరాలు సర్వే చేసేలా ప్రణాళిక రూపొందించామని అధికారులు తెలిపారు. ప్రగతి సాధనలో వెనుకబడి ఉండడంతో సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విధులను సక్రమంగా నిర్వహించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పీజీఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై ఆరా తీశారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసులు, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

కోదండ రామాలయంలో దేవదాయశాఖ ఏసీ పరిశీలన

నందలూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అరవపల్లెలో ఉన్న కోదండరామాలయ పునర్నిర్మాణ పనులను మంగళవారం దేవదాయశాఖ అన్నమయ్య జిల్లా అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ పరిశీలించారు. ధూప, దీప, నైవేద్యం పథకం కింద అర్చకుడి నియామకానికి అనుకూలమైన పరిసితులపై ఆరా తీశారు. ధర్మకర్త గంపా సుధాకర్, నడివీధి సుధాకర్, ఆకుల చలపతి, నారపుశెట్టి వేణుగోపాల్, శివకుమార్‌పాల్గొన్నారు.

కారు, బస్సు ఢీకొని ఒకరి మృతి



సంఘటన స్థలంలో గుమిగూడిన జనం (ఇన్‌సర్ట్) జహీర్ మృతదేహం

కురబలకోట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కారును బస్సు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నా యి. కడప పట్టణానికి చెందిన జహీర్(27) రెడీమేడ్ దుస్తుల దుకాణాన్ని నిర్వహిస్తుంటాడు. మం గళవారం ఉదయం తన తమ్ముడు షామీర్‌తో కలిసి కారులో బెంగ ళూరులో దుస్తులు కొనడానికి బయలుదేరాడు. కురబలకోట మండ లం మధ్యాహ్నంవారిపల్లె సమీపంలో వారి కారు, బస్సును ఢీకొంది.. ఈ ప్రమాదంలో జహీర్ అక్కడిక్కడే మృతి చెందాడు. గాయపడిన షామీర్‌ను 108 వాహనంలో మదనపల్లెలోని ప్రభుత్వాసుపత్రికి తర లించారు. ప్రమాదం కారణంగా రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముదివేడు పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



చంద్రశేఖర్ రెడ్డి (ఫైల్‌ఫొటో)

సిద్దవటం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యం లో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు మండలంలోని తురకపల్లెకు చెందిన చంద్రశేఖర్ రెడ్డి (36) ఏడేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన సబీనా అనే మహిళను వివాహం చేసుకున్నాడు. కడపలో కూలి పనులు చేసేవాడు. అతను ఇంట్లోని పైకప్పునకు చీరతో ఉరి వేసుకున్నట్లు మంగళవారం ఉదయం 6 గంటలకు భార్య గుర్తించింది. మరో ఇద్దరు మహిళల సాయంతో అతనిని కిందికి దింపి చూడగా అప్పటికే మృతిచెందాడని ఆమె తెలిపింది. అప్పుల బాధ తాళలేక ఉరి వేసుకుని ఉంటాడని ఆమె పోలీసులకు తెలియజేసింది. మృతుడి తల్లి మల్లీశ్వరి మాట్లాడుతూ తన భార్య నీచంగా మాట్లాడుతూ వేధిస్తోందని, తనను చంపేస్తారంటూ ఫోన్ చేశాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

మారుతి వ్యాన్ బోల్తా.. ముగ్గురికి గాయాలు

గుర్రంకొండ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి మారుతి వ్యాన్ బోల్తాపడిన సంఘటన మంగళవారం సూరప్పగారిపల్లె సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు కర్ణాటక రాష్ట్రం చింతామణికి చెందిన నంజుండప్ప, ప్రకాశ్, హేమావతి అన్నమయ్య జిల్లా రాయచోటిలోని వీరభద్రస్వామిని దర్శించుకోవడానికి మారుతి వ్యాన్‌లో బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న వ్యాన్ గుర్రంకొండ మండలం చెర్లోపల్లె పంచాయతీ సూరప్పగారిపల్లె సమీపంలోని నయారా పెట్రోల్ బంకు వద్ద అడ్డుగా వచ్చిన ద్విచక్ర వాహనాన్ని తప్పించే యత్నంలో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మారుతి వ్యాన్‌లో ఉన్న నంజుండప్ప(45), ప్రకాశ్(35), హేమవతి(30)కి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో వాల్మీకిపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ మధు రామచంద్రుడు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో 11 మందికి..



మదనపల్లె ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

మదనపల్లె అర్బన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): దైవ దర్శనానికి వచ్చిన 11 మంది రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు.మద న పల్లెలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి అవుట్ పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు కర్ణాటక రాష్ట్రం దేవనహళ్లికి చెందిన వారు రాయచోటిలోని వీరభద్ర స్వామి దర్శనానికి బైక్‌లో బయలుదేరారు. గుర్రంకొండ మండలం, చెర్లోపల్లె సమీపంలోని పెట్రోల్ బంకులో బైక్‌లో పెట్రోల్ పోయించుకుని వేగంగా రోడ్డుపైకి వచ్చారు. అదే సమయంలో గుర్రంకొండ నుంచి వస్తున్న ఒమ్నీ వాహనం ఆ బైక్‌ను తప్పించబోయి అదుపుతప్పి బోల్తా పడింది. ఆ వాహనంలో ఉన్న 11మంది గాయాలు అయ్యాయి. స్థానికులు వారిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. గుర్రంకొండ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎనిమిది మందిపై అట్రాసిటీ కేసు

మదనపల్లె అర్బన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లరాజుగారిపల్లెకు చెందిన ఎనిమిది మందిపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు మదనపల్లె తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. మదనపనల్లె మండలం, నల్లరాజుగారిపల్లెకు చెందిన ముని వెంకటరమణ(69)తన పొలంలో ఇల్లు నిర్మించుకుంటుండగా గత నెల 17వ తేదీన అదే గ్రామానికి చెందిన బాలకృష్ణనాయుడు, కళావతి, రవినాయుడు, నారాయణ, ఆదెమ్మ, శ్రీనివాసులు నాయుడు, సోముశేఖర్‌నాయుడు, సంజు పనులు అడ్డుకుని దాడి చేశారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేసి ఎస్టీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

జలవనరుల శాఖ డీఈఈలకు పదోన్నతులు

కలికిరి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కడప, అన్నమయ్య జిల్లాల్లో జలవనరుల శాఖలో వివిధ విభాగాల్లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా పనిచేస్తున్న 16 మందికి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పదోన్నతులు పొందిన వారిలో కడప ఇరిగేషన్ సర్కిల్‌లో అన్నమయ్య డివిజన్ నారమరాజుపల్లె సబ్ డివిజన్-3 డీఈఈగా పనిచేస్తున్న ఎల్.జయచంద్రా రెడ్డి, విజయవాడ హైడ్రాలజీ (ఇన్వెస్టిగేషన్) విభాగంలో కడప ఆర్వోక్యూఎల్-2 డీఈఈగా వున్న ఎం.పి.విజయకుమార్, కడప కన్‌స్ట్రక్షన్ సర్కిల్-3 విభాగంలో పులివెందులలో జీఎన్ఎస్ఎస్ సబ్ డివిజన్-12లో డీఈఈగా పని చేస్తున్న ఎల్.గోపాల్ రెడ్డి, తిరుపతి తెలుగు గంగ, జీఎన్ఎస్ఎస్ సర్కిల్ పరిధిలోని రేణిగుంట డివిజన్‌కు సంబంధించి కోడూరు సబ్ డివిజన్ డీఈఈ ఎస్.రవిశంకర్ రెడ్డి, కడప జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీరు (ప్రాజెక్టులు) కార్యాలయ డీఈఈ ఎం.జనార్దన్, హంద్రీ నీవా సుజల స్రవంతి మదనపల్లె సర్కిల్-3 పరిధిలోని ఎమ్మిగనూరు సబ్ డివిజన్ డీఈఈ ఎస్.మురళి, ఇదే సర్కిల్-3 కదిరి సబ్ డివిజన్-1లో ఎస్.సురేంద్రనాథ రెడ్డి, తిరుపతి తెలుగ గంగ ప్రాజెక్టు సర్కిల్ పరిధిలోని మదనపల్లె టీజీపీ క్వాలిటీ కంట్రోల్ విభాగంలో డి.శ్రీనివాస రెడ్డి ఉన్నారు. ఇంకా ఎస్‌కేడీ జీఎన్ఎస్ఎస్ కడప సర్కిల్‌కు చెందిన కడప మామిళ్లపల్లె సబ్ డివిజన్-2 డీఈఈ ఎస్.రావి రెడ్డి, కోస్టల్ రీజియన్ ఈపీఈఆర్ఎల్ కడప డివిజన్ డీఈఈ ఎస్.రవిచంద్రన్, ఎన్టీఆర్ టీజీపీ కడప సర్కిల్ పోరుమామిళ్ల డీఈఈ ఎస్.ఉమామహేశ్వర రావు, ఎస్‌కేడీ జీఎన్ఎస్ఎస్ కడప సర్కిల్, మామిళ్లపల్లె సబ్ డివిజన్-1 డీఈఈ వి.వెంకటేశ్వర్లు, ఎన్టీఆర్ టీజీపీ పోరుమామిళ్ల సబ్ డివిజన్-4 డీఈఈ పి.కృష్ణారెడ్డి, జీఎన్ ఎస్ఎస్ కడప సర్కిల్ ఎర్రగుంట్ల సబ్ డివిజన్-4 డీఈఈ ఇ.జయరాము, ఎన్టీఆర్ టీజీపీ పులివెందుల సబ్ డివిజన్-3 డీఈఈ ఎస్.ఈశ్వరయ్య, జీఎస్ఎస్ఎస్ పులివెందుల డివిజన్ కొండాపురం సబ్ డివిజన్-4 డీఈఈ పోతిరెడ్డి ప్రసూనాదేవి ఉన్నారు. వారందరూ పదిహేను రోజుల్లోగా ఆయా విధుల్లో చేరాలం టూ రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పక్కా గృహాల నిర్మాణాలు పూర్తి చేయాలి

● హౌసింగ్ పీడీ శివయ్య

లక్కిరెడ్డిపల్లె, మార్చి 18(ఆంధ్రజ్యోతి):అర్ధాంతరంగా ఆగిపోయిన పక్కా గృహాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ శివయ్య సూచించారు. మంగళవారం మండలంలోని అనంతపురం, హరిజనవాడ, వడ్డెపల్లె, చౌటపల్లెల్లో అసంపూర్తిగా ఉన్న పక్కా గృహాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ ఆర్థిక స్థోమత లేక ఇల్లు నిర్మించుకోలేని ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు ప్రభుత్వం అదనంగా రూ.50 వేలు, ఎస్టీలకు రూ. 75 వేలు ఇస్తోందన్నారు. పనులు మొ దలు పెట్టిన వెంటనే బిల్లులు ఇస్తామన్నారు. పలువురు లబ్ధిదారులు ప్రభుత్వం ఇస్తున్న అదనపు బిల్లుకు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. అసంపూర్తిగా ఉన్న పక్కా ఇళ్ల నిర్మాణాల పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం 350 కోట్ల రూపాయలు మంజూరు చేసిందన్నారు. పక్కాగృహాలు లేని అర్హులైన నిరుపేదలు 2025-26కు సంబంధించిన పక్కాగృహాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. గ్రామ సచివాలయాలు, మండల హౌసింగ్ కార్యాలయంలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఈ ఏడాది మంజూరు చేసే ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం 4.30 లక్షల రూపాయలు ఇస్తుందన్నారు. దరఖాస్తుదారులు ఎస్సీ, ఎస్టీ, బీసీలు తప్పకుండా కులం, ఆదాయం ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హౌసింగ్ ఏఈలు జనార్దన్,అంజి పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ శివయ్య

పొసెషన్ సర్టిఫికెట్ తప్పనిసరి

పెద్దతిప్పసముద్రం మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరు చేసే గృహనిర్మాణాలకు పొసెషన్ సర్టిఫికెట్ తప్పని సరి అని హౌసింగ్ డీఈ వెంకట రెడ్డి వెల్లడించారు. మంగళవారం ఆయన హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్‌తో కలిసి మండలంలోని వివిధ గ్రామాల్లో గృహ నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం స్థానికులతో మాట్లాడుతూ సొంత స్థలం కలిగి ఉన్న వారికి గృహాలు మంజూరు చేస్తామన్నారు. అలాంటి వారు రెవెన్యూ అధికారుల నుంచి పొసెషన్ సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

బకాయిలు చెల్లించకపోతే చర్యలు

వాల్మీకిపురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): బకాయిలు చెల్లించనివారిపై చట్ట పర చర్యలు ఉంటాయని వాల్మీకిపురం మండలం చింతపర్తి పంచాయతీ సెక్రటరీ రెడ్డిశేఖర్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆయన విలేకరులతో మా ట్లాడుతూ చింతపర్తి పంచాయతీలోని ప్రైవేట్ బస్టాండ్, వారపు సంతల్లో సెస్సు వసూలు హక్కులు పొందినవారు 15 ఏళ్లుగా పూర్తి స్థాయిలో డబ్బు చెల్లించలేదన్నారు. పంచాయతీ ఆదాయాన్ని సమకూర్చే లక్ష్యంతో డిపాజిట్లను వారపు సంతకు రూ.4.5లక్షలు, ప్రైవేట్ బస్టాండ్‌కు రూ.90 వేలు నిర్ణయించామన్నారు. 2025-26 సంవత్సరానికి వారపు సంత రూ.6. 15 లక్షలు, ప్రైవేట్ బస్టాండ్‌కు రూ.95 వేలకు వేలం నిర్వహించి వారి నుంచి పూర్తి డబ్బును వసూలు చేశామన్నారు ఇకముందు కూడా ఇలాగే కొనసాగుతాయని తెలియజేశారు.

చేపల చెరువుతో రూ.2.60లక్షల ఆదాయం

ములకలచెరువు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): బట్నాయని చెరువు వేలం ద్వారా రూ. 2,60,500 ఆదాయం వచ్చింది. మద్దినాయనిపల్లె పంచాయతీ కార్యాలయంలో మంగళవారం చెరువులో చేపల పెంచుకునే హక్కులకు మదనపల్లె డీఎల్‌పీఓ నాగరాజు అధ్యక్షతన వేలం నిర్వహించారు. నరసింహులు హక్కు దక్కించుకున్నారు.

సచివాలయం సర్వేయర్ సస్పెన్షన్

బి.కొత్తకోట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): గుమ్మసముద్రం సచివాలయం సర్వేయర్‌గా పనిచేస్తూ ఇటీవల పీటీఎం మండలం టి.సదుం సచివాలయానికి బదిలీపై వెళ్లిన ఎస్. రాజేంద్రను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకు న్నారు. ఈ మేరకు చిత్తూరు జిల్లా భూ'సర్వే అధికారి జయరాజ్ నుంచి మం గళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. గుమ్మసముద్రం సచివాలయం సర్వేయర్‌గా పని చేస్తూ తన తల్లి పేరున అక్రమంగా నాలు గు ఎకరాల భూమిని ఆన్‌లైన్ చేయించుకోవడం, అనేక అక్రమాలు చేసినట్లు ఫిర్యాదులపై ప్రాథమిక చర్యలో భాగంగా ఇతన్ని సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది. విచారణ అనంతరం తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు సమాచారం

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగింపు

● జూనియర్ ఇంటర్ అర్హత పరీక్ష తేదీలో మార్పు

కలికిరి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మహాత్మ జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు పంపుకోవడానికి గడువు పొడిగించినట్లు జిల్లా కన్వీనరు వై.సోమశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తులు పంపుకోవడానికి గతంలో మార్చి 15వ తేదీ చివరి తేదీగా ప్రకటించగా తాజాగా గడువు తేదీని ఈనెల 25 వరకు పొడిగించారు. బీసీ గురుకుల పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతుల్లో బ్యాక్ లాగ్ సీట్ల భర్తీ కోసం, 5వ తరగతిలో పూర్తి సీట్ల భర్తీ కోసం ఈ గడువు పొడిగించినట్లు ఆయన తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని సదుం బీసీ బాలుర జూనియర్ కళాశాలతోపాటు సదుం, కుప్పం (బాలురు), పెద్ద పంజాణి, పులిచెర్ల (బాలికలు) బీసీ గురుకుల పాఠశాలల్లోనూ, తిరుపతి జిల్లాలోని సత్యవేడు, ఐతేపల్లె (బాలురు) ఉదయమాణిక్యం (బాలికలు) తంబళ్లపల్లె (బాలురు), కలికిరి, పీలేరు (బాలికలు) పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు పంపుకోవాలన్నారు. గతంలో జూనియర్ ఇంటర్ ప్రవేశాలకు ఏప్రిల్ 20వ తేదీ ప్రవేశ పరీక్షలు జరగాల్సి ఉండగా తాజాగా దానిని మే 4వ తేదీకి మార్చినట్లు చెప్పారు. అయితే 5వ తరగతి ప్రవేశాలకు గతంలో ప్రకటించిన విధంగానే ఏప్రిల్ 27న, బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీకి అంటే 6, 7, 8, 9వ తరగతులకు ఏప్రిల్ 28న యథాప్రకారం ప్రవేశ పరీక్షలు జరపనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు పంపుకోవాలని కోరారు. ఇతర వివరాలు లేదా సందేహాల కోసం 90007 15637. 87900 92069, లేదా 79894 45396 నంబర్లలో సంప్రదించాలని కన్వీనరు సోమశేఖర్ కోరారు.

మహిళా శిశు సంక్షేమ అధికారిగా అనూరాధ

కలికిరి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారిత అధికారి నియామకంలో స్వల్పంగా మార్పులు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పోస్టులో గుంటూరు జిల్లా ఫిరంగిపురం ఏసీడీపీవోగా పనిచేస్తున్న పి.అనూరాధను వర్క్ డెప్యుటేషన్ ప్రాతిపదికపై మహిళా శిశు సంక్షేమ సాధికారిత అధికారిగా ఈ నెల 5న నియమించినట్లు తెలిసింది. తాజాగా తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు రెగ్యులర్ అధికారిగా నియమిస్తూ ఆ శాఖ కార్యదర్శి ఎ.సూర్యకుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

సేద తీరుస్తున్న తాటికల్లు



- వేసవి తీవ్రత నుంచి ఉపశమనం
- కార్మికుల కుటుంబాలకు ఉపాధి
- పెరిగిన డిమాండ్

రాజంపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో కల్లుకు డిమాండ్ పెరుగుతోంది. దీంతో గీత కార్మికులు కల్లు వ్యాపారంపై దృష్టి పెట్టారు. మార్చి నెల ఆరంభం నుంచి వేసవి తీవ్రత పెరుగుతూ ఉండడంతో దానికితగ్గట్లు కల్లు తీయడం ప్రారంభించారు. నందలూరు, రాజంపేట, సిద్దవటం ప్రాంతాల్లోని చెరువు గట్లు, ఊరి పొలిమేరలు, ఏటిగట్లు, పొలాల చుట్టూ, చెయ్యేరు, పెన్నానది పరివాహక ప్రాంతాల్లో వేలాదిగా తాటిచెట్లు ఉన్నాయి. ఒక్కొక్కరికీ పదుల కొద్ది తాటిచెట్లు ఉండడంతో వాటినుంచి కల్లు గీత, తాటి ముంజెల సేకరణ విక్రయం ద్వారా ఉపాధి పొందుతూ, లాభాలు గడిస్తుంటారు. ఈ సీజన్‌లో గీత కార్మికులు అధికంగా కల్లు గీయడం, గీసిన కల్లును కూడలి ప్రాంతంలో విక్రయించడంలో నిమగ్నమవుతారు. స్వచ్ఛమైన తాటికల్లు ఒక లీటరు 100 రూపాయలు చొప్పున అమ్ముకుంటారు. ఒక్కో చెట్టుకు రోజూ 3 నుంచి 5 లీటర్ల వరకు కల్లు వస్తుంది. ఇలా 5 చెట్లను గీస్తే కనీసం 15 నుంచి 20 లీటర్లు వరకు దిగుబడి వస్తుంది. దీని విక్రయం ద్వారా వచ్చే సొమ్ముతో కల్లుగీత కార్మికులు వేసవిలో కుటుంబాలను పోషించుకుంటున్నారు. ప్రస్తుతం పల్లె ప్రాంతాల్లో సుమారు 200 మంది పైబడి కార్మికులు ప్రస్తుతం ఈ పనిలో నిమగ్నమయ్యారు. చెయ్యేరు నది పరివాహక ప్రాంతాలైన నందలూరు, కుమ్మరపల్లె, ఇసుకపల్లె, నాగిరెడ్డిపల్లె, లేబాక, ఓబిలి, పొత్తపి, టంగుటూరు, నల్లతిమ్మాయపల్లె, మందరం, నారాయణ నెల్లూరు, తాళ్లపాక, మదనగోపాలపురం, గుండ్లూరు, శేషమాంబపురం, రామచంద్రాపురం తదితర ప్రాంతాల్లో తాటిచెట్లు భారీగా ఉన్నాయి. ప్రస్తుతం 10 రోజులుగా తాటిచెట్ల నుంచి విరివిగా కల్లును గీస్తున్నారు. మరో 15 రోజుల్లో తాటిముంజలు కూడ పండనున్నాయి. దీంతో రెండు రకాలుగా వీరికి లాభం చేకూరనుంది. రాను రాను తాటిచెట్లు తగ్గిపోతుండడంతో కల్లు వ్యాపారం కూడా తగ్గిపోతోంది.



కల్లు విక్రయిస్తున్న గీత కార్మికుడు

ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే తెలపండి



నేతలతో మాట్లాడుతున్న ఈఆర్వో రాఘవేంద్ర

తంబళ్లపల్లె, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాలో పొరపాట్లు, మార్పులు, చేర్పులు వంటివి ఉంటే రాజకీయ పార్టీల నేతలు తెలపాలని ఈఆర్వో రాఘవేంద్ర సూచించారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆరు మండలాల ఏఆర్వోలు, రాజకీయ పార్టీల నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాబితాపై అభ్యంతరాలుంటే వెంటనే తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ఎన్నికల ప్రక్రియను బలోపేతం చేసేందుకు, పరస్పర అనుకూల సలహాలు, సూచనలు అందించేందుకు రాజకీయ పార్టీలకు ఎన్నికల కమిషన్ అవకాశం ఇచ్చిందన్నారు. తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఆరు మండలాల ఏఆర్వోలు హరికుమార్, ప్రదీప్, సయ్యద్, శ్రీరాములు, అజార్, తపశ్విని, సిబ్బంది కిషోర్, దినకర్, టీడీపీ, జనసేన, బీజేపీ, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

దేవదాయ భూముల్లో అక్రమ నిర్మాణాలను అడ్డుకోండి



సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌కు వినతిపత్రం ఇస్తున్న బీవైఎస్ నేతలు

మదనపల్లె టౌన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): దేవదాయ భూముల్లో అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ విన్నవించారు. మంగళవారం స్థానిక సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌ను కలిసిన బీవైఎస్ నేతలు మాట్లాడుతూ పట్టణం సహా మండలంలో పలుచోట్ల ఉన్న రూ.కోట్ల విలువైన దేవదాయ భూములను కొందరు ఆక్రమించుకుని లేఅవుట్లు వేసి విక్రయించేశారన్నారు. ప్రస్తుతం దేవదాయ భూముల్లో షాపింగ్ గదులు నిర్మిస్తున్నారన్నారు. ఈ విషయమై ఇది వరకే ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని, ఆయన మదనపల్లె రెవెన్యూ అధికారులకు లేఖ రాశారన్నారు. ఈ లేఖ సారాంశాన్ని పరిశీలించి దేవదాయ భూములను కాపాడాలని పునీత్ సబ్‌కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో బీవైఎస్ నేతలు జిలాని బాషా, ఆది, శశికుమార్, ద్వారక, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

21న ఉపన్యాస పోటీలు

కడప కల్చరల్ మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో ప్రసంగించే అవకాశం కోసం యువతకు ఈ నెల 21న శుక్రవారం కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కాలేజీలో ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కె.మణికంఠ వెల్లడించారు. మంగళవారం బాలాజీనగర్‌లోని నెహ్రూ యువ కేంద్రం కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కడప, అన్నమయ్య జిల్లాల్లో 18 నుంచి 25 ఏళ్ల మధ్య వయసు గల యువతీ యువకులు ఈ ఉపన్యాస పోటీల్లో పాల్గొన వచ్చన్నారు. ఇందులో ప్రధానంగా వన్‌నేషన్, వన్ ఎలక్షన్ అనే అంశంపై ఉపన్యాస పోటీలో ఉంటాయన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన విజేత రాష్ట్ర, దేశస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు ప్రశంసాపత్రం అందిస్తారన్నారు. ఇతర వివరాలకు 9177616677 అనే నెంబరును సంప్రదించాలని సూచించారు.

రేపు చేతివృత్తుల సంఘం నాయకులతో సమావేశం

కడప ఎన్జీఆర్ సర్కిల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆదరణ-3 పథకం ద్వారా కుల వృత్తికి అవసరమైన ఆధునిక పనిముట్లు కోసం జిల్లాలోని బీసీ కుల, చేతివృత్తుల సంఘ నాయకులకు ఈనెల 20న ఉదయం 11గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ జయ సంహ ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి హాజరవుతున్న బీసీ నాయకులు తమ సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. నాయీ బ్రాహ్మణ, రజక, వడ్డెర, మత్స్యకారుల, చేనేత, వడ్రంగి, స్వర్ణకారుల, కల్లుగీత కార్మికులు, కుమ్మరి, మేర, వాల్మీక బోయ, కృష్ణబలిజ, పూసల, సగర, ఉప్పర, శిల్పులు, కరెంటు పని, పాల వ్యాపారం చేసేవారు, ప్లంబర్లు తదితర చేతివృత్తులు చేసుకునే బీసీ కులాలకు చెందిన నాయకులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

24న గోవిందమాంబ ఆరాధన మహోత్సవాలు



వీరబ్రహ్మేంద్రస్వామి సమేత గోవిందమాంబ

బ్రహ్మంగారిమఠం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం దేవస్థానంలో ఈ నెల 24వ తేదీ గోవిందమాంబ ఆరాధన మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఫిట్ పర్సన్ శంకరబాలాజీ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాతా గోవిందమాంబ ఆరాధన మహోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు, సాయంత్రం భజన కార్యక్రమాలు, రాత్రికి గ్రామోత్సవం ఉంటుందన్నారు. భక్తులు ఆరాధన మహోత్సవాల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

కేబుల్ ఆపరేటర్ల సమస్యల పరిష్కారానికి కృషి

కడప(వినాయకనగర్), మార్చి18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఏపీ ఫైబర్‌నెట్ కేబుల్ ఆపరేటర్ల సమస్యలు సీఎం చంద్రబాబునాయుడి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని మాజీ మంత్రి పీతల సుజాత పేర్కొన్నారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రతిరోజు జరిగే గ్రీవెన్‌సెల్ కార్యక్రమానికి మంగళవారం ఏపీ ఫైబర్‌నెట్ కేబుల్ ఆపరేటర్ల జేఏసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నాగిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఛైర్మన్ నారాయణరావు, కార్యదర్శి కమ్మలపాటి సురేశ్‌బాబులు వెళ్లి మంత్రి వినతి పత్రం అందజేశారు. స్పందించి సుజాత వెంటనే సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు జేఏసీ నాయకులు తెలిపారు.

వల్లూరు యువకుడికి అరుదైన గౌరవం

వల్లూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్ననాగిరెడ్డిపల్లె లేబాక నరసింహారెడ్డి జాతీయ బుక్ ఆఫ్ రికార్డుల్లో ప్రత్యేక స్థానం సాధించాడు. తెలంగాణ బాష సంస్కృతీ శాఖ సౌజన్యంతో వెంకీ మ్యూజికల్ అకాడమీ వారి ఆధ్వర్యంలో ఈ నెల 16న హైదరాబాదులో 16గంటల పాటు సుమారు పది బాషల్లో నిరంతరాయంగా పాటలు పాడే పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచి జాతీయ బుక్ ఆఫ్ రికార్డుల్లో మరియు జీనియస్ బుక్ ఆఫ్ రికార్డుల స్థానం దక్కించుకున్నాడు. ఈ అవార్డును సమస్త అధినేత వెంకటేశ్ చేతుల మీదుగా అందుకున్నాడు.

12 మంది బెయిలుపై విడుదల

కడప క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో వీరభద్రస్వామి ఉత్సవాల సందర్భంగా రెండు వర్గాల మధ్య తలెత్తిన వివాదంపై ఈ నెల 9న పోలీసులు కొంత మందిని అరెస్టు చేశారు. వీరికి కోర్టు రిమాండ్ విధించడంతో కడప సెంట్రల్ జైలులో ఉన్నారు. వీరిలో 12 మంది మంగళవారం బెయిలుపై విడుదలయ్యారు. విడుదలైన వారికి వారి బంధువులు స్వాగతం పలికారు.

ఒకే ఒక్కడు

- విభాగాలు ఐదు...అధికారి ఒక్కరు
- కొరవడుతున్న పర్యవేక్షణ
- అస్తవ్యస్తంగా సహకార వ్యవస్థ



కడప ఎన్జీఆర్ సర్కిల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా ప్రభుత్వ రంగ వ్యవస్థలో ఒక్కో విభాగానికి ఒక అధికారి ఉండడం నిబంధన. కానీ జిల్లాలోని సహకార వ్యవస్థలో ఐదు విభాగాలకు ఒకే అధికారి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో ఆశాఖపై పర్యవేక్షణ పూర్తిస్థాయిలో కొరవడుతోంది. ఇక ఆ అధికారి కూడా ఇన్‌చార్జి కావడంతో పాలన అస్తవ్యస్థంగా తయారవుతోంది. వివరాల్లో కెళితే...

జిల్లా సహకార శాఖ అధికారి సుబాషిణి కొన్ని నెలల క్రితం పదవీ విరమణ చేశారు. కడప డివిజన్ కోఆపరేటివ్ అధికారిగా పని చేస్తున్న ఆమె జిల్లా సహకారశాఖ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టడం జరిగింది. ఆమె పదవీ విరమణ తర్వాత ప్రొద్దుటూరు డివిజనల్ కోఆపరేటివ్ సహకారశాఖ అధికారికి కడప డీఎల్సీఓగా, కడప జిల్లా సహకారశాఖ అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇవి కాకుండా కడపలోని హౌస్ బిల్డింగ్ సొసైటీ, జిల్లా కోఆపరేటివ్ ఆడిట్ అధికారి పోస్టులు కూడా ఆయనకే అప్పగించారు. ఈక్రమంలో ఒక అధికారి ఆయా శాఖలకు సంబంధించి పూర్తిస్థాయిలో విధులు నిర్వహించలేని పరిస్థితి. దీంతో ఒక్కో కార్యాలయానికి వారానికి ఒకరోజు కేటాయించినా కూడా ఏ పనిపై సమగ్రంగా దృష్టిసారించలేని పరిస్థితి.

కొరవడుతున్న పర్యవేక్షణ

సహకారశాఖ చాలా కీలకమైనది. వేలాది కుటుంబాలకు జీవనాధారమైన చేనేతరంగం, సహకార బ్యాంకింగ్ వ్యవస్థ, రైతులకు సేవలు అందించేందుకు పనిచేస్తున్న వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాలు, మాక్స్ చట్ట పరిధిలో పనిచేస్తున్న సంఘాలు, పలు రకాల సొసైటీలకు ప్రయోజనాలు కల్పించేందుకు జిల్లా సహకారశాఖ అధికారి పాత్ర చాలా కీలకమైంది. కానీ ఈ పోస్టు సంవత్సరాల తరబడి ఇన్‌చార్జి అధికారుల పాలనలో కొనసాగుతోంది. జిల్లా కేంద్రంలోని డివిజనల్ సహకార శాఖ అధికారి పోస్టు కూడా ప్రస్తుతం ఇన్‌చార్జి అధికారి పాలనలోనే ఉంది. సహకార వ్యవస్థలోని సొసైటీలు సంఘాలకు సంబంధించిన నిర్వహణ బాధ్య తలను పర్యవేక్షించాల్సిన ఆడిట్ అధికారి పోస్టు కూడా ఖాళీగా ఉం ది. సంఘాల పనితీరుపై సమగ్రంగా ఆడిటింగ్ పనులను పర్య వేక్షించేందుకు రెగ్యులర్ అధికారి లేకపోవడంతో ఇబ్బందికరమైన పరిస్థతులు కనిపిస్తున్నాయి. దీంతో చాలా వరకు సొసైటీల్లో ఉద్యో గ నియామకాల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారంటూ ఆడిటింగ్ అధికారులు నోటీసులు ఇచ్చారు. అదేవిధంగా పలు సొసై టీల్లో అక్రమాలు జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ కుంటు పడుతోంది. ఇక సహకార హౌస్‌బిల్డింగ్ సొసైటీలో రెగ్యులర్ అధి కారి అందుబాటులో లేకపోవడంతో అక్కడ పనులు ఆశించినంత మేర జరగడం లేదనేది స్పష్టం అవుతుంది.

పదోన్నతుల కోసం ఏళ్ల తరబడి నిరీక్షణ

సహకారశాఖలో అధికారులు పదోన్నతుల కోసం దాదాపు దశాబ్దాల తరబడి నిరీక్షస్తున్నారు. ఉన్నతాధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నా, పదోన్నతులకు అర్హులైన అధికారులు ఉన్నప్పటికి సహకారశాఖ, ప్రభుత్వాలు ఆ దిశగా తగిన చర్యలు తీసుకోకపోవడంతో అధికారులు కూడా నిరాశ నిస్పృహలో ఉన్నారు. దీంతో కీలకమైన శాఖలో సమర్థవంతమైన అధికారులు రెగ్యులర్‌గా లేకపోవడం వల్ల ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సహకార శాఖలో అధికారులకు పదోన్నతులు కల్పించే దిశగా అడుగులు పడుతున్నట్లు తెలుస్తోంది. జోన్, జిల్లాస్థాయిలో అధికారుల సర్వీసు, రోస్టర్ పాయింట్ ఆధారంగా పదోన్నతులు సంబంధించిన సీనియారిటీ జాబితాను రూపొందించినట్లు తెలు స్తోంది. త్వరితగతిన సహకార శాఖలో అదికారులకు పదోన్నతులు కల్పిస్తే రెగ్యులర్ అధికారులకు అదనపు బాధ్యతలు తప్పే పరిస్థితి లేకపోలేదు. ప్రభుత్వం, సహకార శాఖ ఉన్నతస్థాయి అధికార యంత్రాంగం పదోన్నతుల విషయంలో దృష్టిసారించి సహకార వ్యవస్థను గాడిలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అధికారిక ఉత్తర్వులు గౌరవించక తప్పదు

అధికారిక ఆదేశాల మేరకు నడుచుకుంటూ వారి ఉత్తర్వులను గౌరవించడం ప్రతి అధికారికి తప్పదు. ప్రస్తుతం సహకార వ్యవస్థలో కంప్యూటరీకరణ జరుగుతోంది. జిల్లాలో దాదాపు 60శాతం పూర్తయంది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాతనే మిగతా పనులు ఏవైన జరిగే అవకాశాలు ఉన్నాయి.

- సురేష్‌కుమార్, జిల్లా సహకార శాఖ అధికారి (ఎఫ్ఏసీ)

'ఉపాధి'లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవు

- డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి

చక్రాయపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథ కంలో అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాత్రి చక్రాయపేటలో సామాజిక తనిఖీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చక్రాయపేట మండలం కరువుకాటకాలకు నిలయమని, భూగర్భజలాలు అడుగంటి నీటి ఎద్దడి ఏర్పడిందన్నారు. రాబోయే రోజుల్లో నీటి గుంతలకు, ఫారం పాండ్స్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. త్వరలో జిల్లాలో ఉపముఖ్యమంత్రి పర్యటిస్తున్నారని, చక్రాయ పేట కు వచ్చే అవకాశం ఉందన్నారు. అనంతరం మండలంలోని 14 గ్రామాల వారీగా ఉపాధి పనులకు సంబంధించి రికార్డులు పరిశీలించి రూ.55,227 రికవరీ చేశామన్నారు. రూ.71వేలు జరిమానా విధించామన్నారు. అలాగే హౌసింగ్, పంచాయ తీరాజ్ శాఖలకు సంబంధించి రూ.1.53 లక్షలు జరిమానా విధించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ సోమ శేఖర్‌రెడ్డి, డీఈ రామలింగేశ్వర్ రెడ్డి, క్వాలిటీ ఈఈ విజయ భాస్కర్, ఏపీఓ గంగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ప్రభుత్వ భూముల కబ్జా

- అఖిలపక్ష ఐక్యవేదిక కన్వీనర్ ఆంజనేయులు



కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలిస్తున్న అఖిలపక్ష నాయకులు

సీకేదిన్నె, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కడపలో గత అయిదు సంవత్సరాల్లో నగరం చుట్టుపక్కల ప్రాంతాల్లో భూ మాఫియా పెట్రేగిపోయిందని అఖిలపక్ష ఐక్యవేదిక కన్వీనర్ కారు ఆంజనేయులు తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం ఊటుకూరు సర్వే నంబరు 235-2లో ఉన్న 42.75 ఎకరాల ప్రభుత్వ భూమిని మంగళవారం అఖిలపక్ష నాయకులతో కలిపి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడపలో భూకబ్జాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని, ప్రభుత్వ భూమి ఖాళీగా కనపడితే అధికారులను మేనేజ్ చేసి భూదందా కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారబలంతో కోట్ల విలువచేసే భూములను తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి సొంతం చేసుకుంటున్నారన్నారు. తాము పరిశీలించిన భూమిలో 42.75 ఎకరాలకు 36.95 ఎకరాలభూమి ఉందని.. అయిదు ఎకరాలకుపైగా కబ్జాకు గురైందన్నారు. ఇక్కడున్న రైల్వే పంప్‌సెట్ కూడా పగులకొట్టి భూకబ్జాదారులు వెంచర్లు వేశారన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష రాజకీయ ప్రజాసంఘ నాయకులు, చేతివృత్తుల జాతీయ కన్వీనర్ అవ్వారు మల్లికార్జున, రైతు స్వరాజ్య వేదిక పుత్తా శివారెడ్డి, దళితమిత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, లోక్‌సత్తా పార్టీ జిల్లా కన్వీనర్ దేవరకృష్ణ, హేతువాద సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సీఆర్‌వీ ప్రసాద్, గ్రేటర్ రాయలసీమ అభివృద్ధి వేదిక జిల్లా కన్వీనర్ ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న పెట్రోల్ ట్యాంకర్... డ్రైవర్ మృతి



మృతి చెందిన డ్రైవర్

ఎర్రగుంట్ల, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్లలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఖాదరయ్య (41) అనే డ్రైవర్ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.... సత్యసాయి జిల్లా ఎన్‌పీ కుంటకు చెందిన ఖాదరయ్య హిందూస్థాన్ పెట్రోలియం (హెచ్‌పీ)కార్పొరేషన్‌లో ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గుత్తిలో ట్యాంకర్‌కు పెట్రోల్ లోడ్ చేసుకుని కడప వైపు బయలుదేరాడు. ఎర్రగుంట్ల షైహోం సమీపంలోకి రాగానే ముందువెళుతున్న లారీని వేగంగా ఢీకొంది. దీంతో ట్యాంకర్ లారీలోకి చొచ్చుకు పోయి డ్రైవర్ ఖాదరయ్యకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి- కేసు నమోదు

కొండాపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మా పురం క్రాస్ వద్ద వ్యక్తిపై దాడి చేసిన సంఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానిక తిమ్మాపురం క్రాస్ వద్ద సింహాద్రి పురం మండలం బిదెనంచెర్ల గ్రామానికి చెందిన నరసింహులుపై అనంతపురం జిల్లా సజ్జలదిన్నెకు చెందిన లక్షుమయ్య, చిరంజీవిలు దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సమష్టి కృషితో విద్యుత్ ప్రమాదాల నివారణ



మాట్లాడుతున్న ఎస్ఈ రమణ

కమలాపురం రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాలను సమష్టి కృషితో నివారించవచ్చని విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీరు ఎస్.రమణ తెలిపారు. కమలాపురంలోని మున్సిపల్ ఆఫీసు ఎదురుగా మంగళవారం రాత్రి విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వ హించారు. విద్యుత్ ప్రమాదాల వల్ల కలిగే నష్టాలను షార్ట్‌ఫిలిం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రమణారెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కిరణ్, అసిస్టెంట్ ఇంజనీరు చాంద్‌బాషా, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా పేరు మార్చడం హర్షణీయం

- ప్రజల మనోభావాలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం
- టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఇ.హరిప్రసాద్



విలేకరులతో మాట్లాడుతున్న హరిప్రసాద్

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ జిల్లా పేరును వైఎస్సార్ కడప జిల్లాగా పేరు మార్చడం పట్ల జిల్లా ప్రజలు హర్షిస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి బి.హరిప్రసాద్ అన్నారు.

మంగళవారం హరటవర్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కడపకు ఎంతో చరిత్ర ఉందని.. తిరుమల తొలి గడప కడప అని.. మత సామరస్యానికి ప్రతీక అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా ప్రజల మనోభావాలను అర్థం చేసుకొని మంత్రివర్గ సమావేశంలో వైఎస్సార్ జిల్లా పేరు ను వైఎస్సార్ కడప జిల్లాగా మారుస్తూ తీసుకున్న నిర్ణయం పట్ల జిల్లా ప్రజలందరు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం ఎంతో చరిత్ర కలిగిన కడప జిల్లాను వైఎస్సార్ జిల్లాగా పేరు మార్చిందని.. అప్పటి నుంచి ఎన్నో ఆందోళనలు చేసినా పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం పేరు మారుస్తూ నిర్ణయం తీసు కుందని.. అందుకు జిల్లా ప్రజల తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు నాగరాజు, గంధం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యం... బాలచంద్రుడు ఆదర్శం





జీవామృతం తయారు చేస్తున్న రైతు

చెన్నూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకంతో భూమి నిస్సారమై.. ఏ పంట సాగు చేసినా పెట్టిన పెట్టుబడులు రాక విసిగిపోతున్న రైతన్నల పరిస్థితులను కళ్లారచూసిన ఆయనను ఆలోచనల్లో పడేశాయి. ఈ నేపధ్యంలో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే దిశగా రైతు బాలచంద్రుడు ప్రకృతి వ్యవసాయానికి శ్రీకారం చుట్టారు. 2018లో నాటి టీడీపీ ప్రభుత్వ హయాంలో గుంటూరులో నిర్వహించిన జీరో బడ్జెట్ ప్రకృతి వ్యవసాయంలో సుభాష్ పాలేకర్ శిక్షణలో పాల్గొని పలు అంశాలు తెలుసుకున్నారు. అలాగే మహారాష్ట్రలో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న పంటలను ప్రత్యక్షంగా పరిశీలించి.. సాంప్రదాయ వ్యవసాయ పద్ధతుల్లో పంటల సాగుకు చేపట్టడం మొదలు పెట్టారు.

మండలంలోని కనుపర్తి గ్రామానికి చెందిన రైతు బాలచంద్రుడు బీఎస్సీ చదివారు. ఈయ న తండ్రి నుంచి సంక్రమించిన ఐదు ఎకరాల భూమిలో సంప్రదాయ వ్యవసాయ పద్ధతుల్లో పసుపు, వరి, టమోటా, మిరప, కాకర, నువ్వులు, వంకాయ, దోస వంటి పంటలు సాగు చేస్తున్నారు. ద్రవ జీవామృతం, పంచగవ్య, ఆవాల పిండి, సైంధవ లవణం లాంటివి పంటల సస్యరక్షణకు ఉపయో గిస్తూ.. మంచి దిగుబడులు సాధిస్తున్నారు. తోటి రైతులను ప్రకృతి వ్యవసాయం చేపట్టేలా ప్రోత్సాహిస్తున్నారు. అంతేగా కుండా ప్రొద్దుటూరు, గుంతకల్లు, వరంగల్ తదితర ప్రాంతాలకు వెళుతూ రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగా హన కల్పిస్తు న్నారు. ఇక ఈ ఏడాది రిపబ్లి క్ డే రోజున రైతు బాలచంద్రుడు తన ఉత్పత్తులను ప్రదర్శించడంతో కలెక్టరు చెరుకూరి శ్రీధర్, వ్యవసాయాధికారి నాగేశ్వర్‌రావు, జిల్లా ప్రాజెక్టు మేనేజరు ప్రవీణ్ కుమార్‌లు పరిశీలించి ప్రశంసించారు.

పసుపు పంట సాగులో...

గత ఏడాది 2 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరిస్తూ పసుపు పంట సాగు చేశాడు. రెండు ఎకరాల సాగుకు 2.7 లక్షలు పెట్టుబడి పెట్టి రూ.10 లక్షలపైన ఆదాయాన్ని సంపాదించాడు. ఇక ఆయన పండించిన పసుపు దేశంలోనే అత్యంత నాణ్యతగా ఉందని పలువురు శాస్త్రవేత్తలు ప్రశంసించినట్లు తెలిపారు. ముఖ్యంగా మహారాష్టకు చెందిన ఓ సంస్థ 25 క్వింటాళ్ల పసుపు కొనుగోలుకు ముందస్తుగా ఆర్డరు ఇచ్చినట్లు రైతు తెలిపారు.

రసాయనాలతో భూమి నిస్సారం

రైతులు పంటల సాగులో విరివిగా రసాయనాలు వాడితే భూమి నిస్సారమవుతుందని.. ఇది భవిష్యత్తులో తీరని నష్టం కలిగిస్తుందని రైతు బాలచంద్రుడు అంటున్నారు. అంతేకాక తల్లి తన బిడ్డను కడుపులో 9 నెలలు మోస్తే... నేలతల్లి జీవితాంతం మోస్తుందని.. అందుకే ప్రతి రైతు భూమిని కాపాడుకోవాలని చెబుతున్నారు.



సేంద్రయ పద్ధతుల్లో సాగు చేసిన పసుపు పంట కళకళలాడుతున్న దృశ్యం,

చల్లంగా చూడమ్మా... గంగమ్మ తల్లి



పూజలు చేస్తున్న సుగవాసి

రాయచోటిటౌన్, మార్చి18(ఆంధ్రజ్యోతి): 'గంగమ్మ తల్లి.. ప్రజలందరినీ చల్లంగా చూడమ్మా' అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు వేడుకున్నారు. మంగళవారం గంగమ్మ తల్లి తిరునాళ్ల సందర్భంగా ప్రసాద్‌బాబుకు హాజరయ్యారు. పల్లా రమేశ్, సుగవాసి బాలాజీ, అనూప, బడిశెట్టి రవి, మనోహర్ పాల్గొన్నారు.

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

● హెల్త్‌ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ

రాయచోటిటౌన్, మార్చి18(ఆంధ్రజ్యోతి):వేసవిలో వడదెబ్బకు గురికాకుండా విద్యార్థులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ పేర్కొన్నారు. మంగళవారం ఆయన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు రాయచోటి పట్టణంలోని డైట్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మధ్యాహ్న సమయంలో విద్యార్థులు బయటకు వెళ్లకుండా ఇళ్లలోపలే ఉండి హోమ్ వర్క్ చేసుకోవడం, చదువుకోవడం లేదా నిద్రపోవడం చేయాలన్నారు. ఎండలో క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ వంటి ఆటలు ఆడటం వల్ల వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. వడదెబ్బకు గురైన వారికి ఎక్కువగా జ్వరం, తలనొప్పి, నీరసం, కళ్లు తిరగడం, విరేచనాలు, వాంతులు, నోరు ఆరిపోవడం, అపస్మారక స్థితిలోకి వెళ్లడం, కలవరింతలు వంటి లక్షణాలు ఉంటాయన్నారు. వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే చల్లటి, నీడ ప్రదేశంలోకి తీసుకెళ్లాలని, మెలకువలో ఉంటే ఉప్పు కలిసిన మజ్జిగ గానీ, ఓఆర్ఎస్ ద్రావణం గానీ తాగించాలన్నారు.చల్లటి నీటితో ముఖం కడగాలని, గాలి బాగా వచ్చే విధంగా ఫ్యాన్ కింద ఉండాలని, వీలైతే మాట్లాడిస్తూ ఉండాలన్నారు. అంతేగాక 108కి కాల్ చేసి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలన్నారు.ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల లోపు బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు తీసుకొని వెళ్లాలన్నారు. గంట గంటకు ఒక గ్లాస్ నీరు తాగాలని, ఇంటిలో కిటికీలు తెరిచి ఉంచాలని, నల్లని బట్టలు వేయరాదని, కద్దరు బట్టలు వదులుగా ఉన్నవి వేసుకోవాలని సూచించారు. దూర ప్రయాణాలు చేయరాదని, గర్భవతులు, బాలింతలు, 10 సంవత్సరాలలోపు పిల్లలు, 60 సంవత్సరాలు పైబడిన వారు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మల, సిబ్బంది పాల్గొన్నారు.



వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్‌రఫీ

వింతలు.. విశేషాలు

రైల్వేకోడూరు మండలం రాఘవరాజపురం ప్రధాన విద్యుత్ కార్యాలయం ఆవరణంలో బ్రిటీష్ కాలం నాటి చేతిపంపు ఉంది. తెల్లదొరల పాలనలో నిర్మాణ పనులు ఇంత పటిష్టంగా ఉండేవనేందుకు ఇదో మచ్చుతునక. అయితే పిచ్చిమొక్కల నడుమ ఉంది. దీన్ని రిపేరు చేయగలిగితే నీరు వస్తుందని పలువురు అంటున్నారు. అప్పట్లో విద్యుత్ అధికారులకు తాగునీరు అందించాలనే ఉద్దేశ్యంతో ఈ చేతి పంపును ఏర్పాటు చేశారని స్థానికులు చెబుతున్నారు.

-రైల్వేకోడూరు, (ఆంధ్రజ్యోతి)



డంపింగ్ యార్డుతో ఇబ్బందులు

రైల్వేకోడూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): గుంజననది పక్కనే ఉన్న డంపింగ్ యార్డు నుంచి నిత్యం పొగలు వస్తుండటంతో ఇబ్బందిపడుతున్నామని, ఆ పొగ పీల్చుకున్న వారు అనారోగ్య పాలవుతున్నారని స్థానికులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలిపి అనంతరం పోలీస్‌స్టేషన్, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలు మాట్లాడుతూ డంపింగ్ యార్డుకు సమీపంలో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, వసంతనగర్, వినాయకనగర్, జగడంపల్లె, విద్యానగర్, సమతానగర్, గుర్రప్పపాళెం గిరిజనకాలనీ, ఉంగరాలనగర్, వసంతనగర్, ప్రధాన రోడ్డు, నరసరాంపేట తదితర ప్రాంతాలకు ఈ పొగలు విస్తరిస్తాయన్నారు. పట్టణానికి 5 కిలోమీటర్ల దూరంలో డంపింగ్ యార్డు ఉండాలని నిబంధనలు ఉన్నా దీనిపై అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతున్నారన్నారు. డంపింగ్ యార్డుకు స్థలాన్ని కేటాయించాలని పంచాయతీ సర్పంచ్ బుడిగి శివయ్య, టీడీపీ యువ నాయకులు పోతురాజు నవీన్ తహసీల్దార్ మహబూబ్ చాంద్‌కు వినతిపత్రం అందజేశారు.



డంపింగ్ యార్డు నుంచి వస్తున్న పొగ

చివరి ఆయకట్టుకు నీరు అందేదెలా?

సుండుపల్లె, మార్చి18(ఆంధ్రజ్యోతి): యర్రపురెడ్డి ఆదినారాయణరెడ్డి ప్రాజెక్టులో పుష్కలంగా నీరు ఉన్నా కుడికాలువ భాగంలో ఉన్న రైతులకు నీరు అందని పరిస్థితి ఏర్పడింది. కుడికాలువకు పింఛా ప్రాజెక్టు నీటిని విడుదల చేశారు. కాలువకు సరిపడా నీరు విడుదల చేయకపోవడం ఒక సమస్య అయితే పై ప్రాంతంలో రైతులు కాలువకు అడ్డుగా చెత్తాచెదారం వేయడంతో చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం పింఛా ప్రాజెక్టు ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ నాగేంద్రనాయక్ దృష్టికి తీసుకెళ్లగా కొంత మంది రైతులు కాలువకు అడ్డంగా కంచెలాగా ఏర్పాటు చేసి తూములకు అధికంగా నీరు అందాలన్న ఉద్దేశ్యంతో చెత్తాచెదారం వేయడంతో దిగువ భాగానికి నీరు అందించలేకపోతున్నామన్నారు. ఇకపై కాలువలో సాగు నీటికి అడ్డుకట్ట వేయాలని ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని తెలియజేశారు.



చెక్కర సిద్దయ్య ఇళ్ల వద్ద అరకొరగా ప్రవహిస్తున్న పింఛా ప్రాజెక్టు నీరు

మామిడిలో సస్యరక్షణపై శిక్షణ

రైల్వేకోడూరు రూరల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మామిడిలో పూత, పిందె దశలో సస్యరక్షణపై నేడు అనంతరాజుపేట ఉద్యాన కళాశాల పరిశోధన కేంద్రంలో శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఉద్యాన శాఖ అధికారులు ఎం. భాస్కర్, జి.సురేష్ బాబు తెలిపారు. ఫ్రూట్ కవర్స్ వినియోగం, మార్కెటింగ్‌పై అనంత రాజుపేట శాస్త్రవేత్తలచే రైతులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. రాజంపేట డివిజన్‌లోని కోడూరు, రాజంపేట రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

రామాపురం, మార్చి18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశం కోసం విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ శ్యామలాదేవి తెలిపారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు మార్చి 17 నుంచి మే 22వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మార్కుల మెరిట్, రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయిస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

పశువైద్య శిబిరం విజయవంతం

సుండుపల్లె, మార్చి18(ఆంధ్రజ్యోతి): సుండుపల్లె మండలంలోని సొంతంవారిపల్లె గ్రామ పంచాయతీలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ సహకారంతో వైద్య శిబిరం నిర్వహించినట్లు పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై తెలిపారు.
మంగళవారం ఆత్మ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి కడప జిల్లా ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మండల సహాయ సంచాలకులు విజయ్‌కుమార్, గర్భకోశ వ్యాధి నిపుణులు డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, జిల్లా ఉపసంచాలకులు డాక్టర్ డీ. మాలకొండయ్య, డాక్టర్ బీవీ రమణయ్య, డాక్టర్ సంధ్యారాణి, శివరామిరెడ్డి పాల్గొన్నారు.

భూ రీసర్వే పక్కాగా నిర్వహించాలి: ఆర్డీవో

రామాపురం, మార్చి18(ఆంధ్రజ్యోతి): భూ రీసర్వే పక్కాగా నిర్వహించాలని అన్నమయ్య జిల్లా ఆర్డీవో శ్రీనివాస్ అన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లి గ్రామ పొలంలో భూ రీసర్వే చేస్తున్న రికార్డులను మంగళవారం ఆయన పరిశీలించారు. నల్లగుట్టపల్లి గ్రామ పొలంలో రీసర్వే ప్రక్రియ జరుగుతోందని, తహసీల్దార్ రామాంజనేయులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై కూడా సమక్షించారు. తహసీల్దార్ రామాంజనేయులు, ఆర్ఐ సమ్మద్‌ఖాన్, వీఆర్‌వోలు, వీఆర్ఏలు, సర్వేయర్లు పాల్గొన్నారు.



నల్లగుట్టపల్లిలో రీసర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాస్

29న న్యాయవాదుల సంఘం ఎన్నికలు

●ఎన్నికల అధికారిగా రాజకుమార్‌రాజు నియామకం

రాయచోటిటౌన్,మార్చి18(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు ఈ నెల 29న రాయచోటి బార్ అసోసియేషన్ సాధారణ ఎన్నికలు జరిగేటట్లుగా రాయచోటి బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటీవ్ కమిటీ నిర్ణయించినట్లు అధ్యక్షుడు ఎన్. ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పీ. రెడ్డెయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికలు నిర్వహించడానికి సీనియర్ న్యాయవాది రాజకుమార్‌రాజును ఎన్నికల అధికారిగా, ఇలియాస్‌బాషాను అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా ఎగ్జిక్యూటీవ్ కమిటీ నియమించినట్లు వారు తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే న్యాయవాదులు ఈ నెల 20, 21, 22 తేదీల్లో నామినేషన్లు వేయవచ్చునన్నారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తయిన అనంతరం ఈ నెల 24న నామినేషన్ల పరిశీలన, 25న ఉపసంహరించుకోవడానికి సమయం ఉంటుందన్నారు. అలాగే ఈ నెల 29న ఉదయం 10 గంటలకు నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఓటు హక్కు ఉన్న న్యాయవాదులందరూ ఓటింగ్‌లో పాల్గొనవచ్చునని, అదే రోజు 5 గంటలకు కౌంటింగ్ మొదలుపెట్టి ఎన్నికల ఫలితాలు విడుదల చేయనున్నట్లు ఎన్నిక అధికారి వివరించారు.

బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి నామినేషన్

రాజంపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి సీనియర్ న్యాయవాది సింగంశెట్టి కృష్ణకుమార్ నామినేషన్ వేశారు. మంగళవారం బార్ అసోసియేషన్ ప్రధాన ఎన్నికల అధికారి సురేష్‌కుమార్, సహాయ ఎన్నికల అధికారి గోవర్ధన్‌రెడ్డికి నామినేషన్ పత్రాలను అందజేశారు. ప్రతిపాదకులుగా అనుగోలు వెంకటసుబ్బయ్య, బాసినేని రమేష్‌లు సంతకాలు చేశారు. బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సీనియర్ న్యాయవాదులు కందల వెంకటరమణ, గుండ్లూరు రమేష్‌నాయుడు, బండారు సులోచన, విశ్రాంత న్యాయమూర్తులు రామాంజనేయులు, మన్నేరు వెంకటసుబ్బయ్య, కత్తి సుబ్బరాయుడు, రవిశంకర్ పాల్గొన్నారు.



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న కృష్ణకుమార్

బయో మెట్రిక్ డివైజ్‌లు పంపిణీ

పెనగలూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పెనగలూరు మండలానికి మంజూరు చేసిన 84 డివైజ్‌లను మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయం సిబ్బందికి పంపిణీ చేసినట్లు ఎంపీడీవో విజయరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ ఇవి ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానం కలిగిన డివైజ్‌లు అని తెలిపారు. తద్వారా బయో మెట్రిక్ అతింటిఫికేషన్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ రామక్రిష్ణ మృతి

రైల్వేకోడూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, కోడూరు నివాసి వై.రామక్రిష్ణ (84) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఆయన ప్రిన్సిపాల్‌గా, కడప డీవీఈవోగా పనిచేశారు. చిట్వేలి మండలం వెంకటరాజుపల్లె లో ఆయన జన్మించారు. 33 సంవత్సరాల పాటు విద్యారంగంలో సేవలు అందించారు. రైల్వేకోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాటనీ అధ్యాపకుడిగా, తంబళ్లపల్లె జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు. ఆయనకు కుమార్తె వసుంధర, అల్లుడు ఎస్ఎన్ శ్రీనివాసులు, కుమారులు రమేష్, రాగవర్ధన్, వంశీక్రిష్ణ ఉన్నారు.



రామక్రిష్ణ (ఫైల్)

'దళితులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి'

రాయచోటిటౌన్, మార్చి18(ఆంధ్రజ్యోతి): మదనపల్లి మండలం బొగ్గిటివారిపల్లెలో దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు యుగంధర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన బాధితులతో కలిసి ఎస్పీ విద్యాసాగర్‌నాయుడికి ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహానికి కేటాయించిన స్థలంలో గుడి ఏర్పాటుకు భూమిని చదును చేస్తుండగా దళితులు అడ్డుకోవడంతో వారిపై దాడి చేసి చితకబాధారన్నారు. బాధితులను అవమానపరిచిన పోలీసులపై శాఖాపరమైన చర్యలు తీసుకుని దాడికి పాల్పడ్డ వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా సెక్రటరీ మహేశ్‌బాబు, మదనపల్లి నాయకులు ప్రశాంత్, బహుజన నాయకులు నరసింహులు పాల్గొన్నారు.

బ్యాంకు పథకాలపై అవగాహన అవసరం

ఓబులవారిపల్లె, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకు పథకాలపై వినియోగదారులకు అవగాహన అవసరమని వీఐడీఎస్ ప్రతినిధులు ప్రతాప్, శ్రీహరి తెలిపారు. మంగళవారం గాదెల, జి.కొత్తపల్లె గ్రామ పంచాయతీలలోని ఉపాధి హామీ కూలీలకు బ్యాంకు పథకాలపై అవగాహన కల్పించారు. బడ్జెట్ ప్రణాళికలు, వివిధ రకాల బ్యాంకు ఖాతాలు, సామాజిక భద్రత పథకాలైన పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై, ఏపీవై, ఎన్‌పీఎస్ వాత్సల్య, సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాలను ప్రభుత్వ రంగ బ్యాంకులు, తపాల కేంద్రాల్లో తమ ఖాతాకు అనుసంధానం చేసుకోవడం ద్వారా తమకు, తమ కుటుంబాలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు.

ఏడూర్ల మారెమ్మ జాతరను వైభవంగా జరుపుకుందాం

నందలూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీ గ్రామ దేవత ఏడూర్ల మారెమ్మ జాతరను వైభవంగా జరుపుకుందాం అని మారెమ్మతల్లి ఆలయ ధర్మకర్తల మండలి పిలుపునిచ్చింది. సోమవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ధర్మకర్తల మండలి ప్రతినిధులు మాట్లాడారు. అమ్మవారి ఆలయ చరిత్ర మండలానికి తలమానికమన్నారు. అమ్మవారి ఆలయ స్థల సమస్యలు పరిష్కరించేందుకు అందరం కలిసికట్టుగా ముందుకు వెళదామన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

వేలూరు బస్సు సర్వీసును రాయచోటివాసులు సద్వినియోగం చేసుకోవాలి

రాయచోటిటౌన్, మార్చి18(ఆంధ్రజ్యోతి): రాయచోటి నుండి తమిళనాడు రాష్ట్రంలోని వేలూరుకు వెళ్లే బస్సు సర్వీసును రాయచోటి ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాయచోటి ఆర్టీసీ డిపో మేనేజర్ ధనుంజయ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల సౌకర్యార్థం రాయచోటి డిపో వారిచే వేలూరుకు బస్ సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ బస్ ప్రతి రోజు ఉదయం 5 గంటలకు, మధ్యాహ్నం 1 గంటకు వేలూరుకు వెళ్లే సర్వీసు రాయచోటి బస్టాండు నుండి బయస్ బయలుదేరుతుందన్నారు. అలాగే ఉదయం 9 గంటలకు, సాయంత్రం 4.45 గంటకు వేలూరు నుండి రాయచోటికి బయలుదేరుతుందన్నారు. కావున రాయచోటి ప్రాంత ప్రజలు వేలూరు సీయంసీ హాస్పిటల్‌కు, అరుణాచలం, గోల్డెన్ టెంపుల్ వెళ్లడానికి ఈ బస్ సర్వీస్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

లక్కిరెడ్డిపల్లె, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లె రామ్‌ప్రసాద్‌రెడ్డి,లక్ష్మీప్రసాద్‌రెడ్డిల జన్మదినం సందర్భంగా టీడీపీ లక్కిరెడ్డిపల్లె కార్యాలయంలో నేడు మెగా రక్తదాన శిబిరం, అన్నదానం నిర్వహిస్తున్నట్లు మండల యువజన నాయకుడు యనమల మధన్‌మోహన్ తెలిపారు. మంగళవారం పార్టీ కార్యాలయం ఆవరణంలో ఏర్పాట్లను పరిశీలించారు. టీడీపీ నాయకులు ఆరీఫ్, రాజంపేట డాక్టర్ల సెల్ ప్రధాన కార్యదర్శి షఫీనాయక్, జేకే రెడ్డి, సయ్యద్ ముక్సుద్, ఆర్కే హేమంత్‌రెడ్డి, ముక్తార్ అహ్మద్ పాల్గొన్నారు.

అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో ఘనంగా ఫార్మా డీ ఉత్సవాలు

రాజంపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అన్నమాచార్య కళాశాలలో మంగళవారం ఫార్మ డీ వేడుకలు ఘనంగా జరిగాయి. చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఐదో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఆప్యాయంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ సాయిబాబారెడ్డి, అన్నమాచార్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపాల్ స్వర్ణలత మాట్లాడుతూ ఉన్నత ఉద్యోగాల్లో చేరి ప్రయోజకులు అయినప్పుడే చదివిన చదువుకు సార్థకత చేకూరుతుదన్నారు. ఈ సందర్భంగా ఫార్మడీ విద్యార్థులు ఉపన్యాసం చేశారు. విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు.



విద్యార్థులకు మెమెంటోలు అందజేస్తున్న వైస్‌చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి

బస్టాండ్ గేటు, కాంప్లెక్స్ గదుల బహిరంగ వేలం

లక్కిరెడ్డిపల్లె, మార్చి 18(ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీలోని బస్టాండ్ గేటు, కాంప్లెక్స్ గదులకు ఈ నెల 20న బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి సుదర్శన్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.
పాటలో పాల్గొనే వారు బస్టాండ్ గేటుకు రూ.లక్ష, గదులకు రూ.20వేలు ధరావత్తు చెల్లించాలన్నారు. పాట దక్కించుకున్నవారు మొత్తం రుసుం చెల్లించి రసీదు పొందాలని కోరారు.

ఉప రాష్ట్రపతితో ఎంపీ మేడా రఘు భేటీ

రాజంపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్‌తో రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఎథిక్స్ కమిటీ మెంబర్‌గా ఎంపికైన సందర్భంగా ధన్యవాదాలు తెలపడానికి రాజ్యసభ చైర్మన్ అయిన ఉపరాష్ట్రపతి దన్కర్‌తో భేటీ అయి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మేడా రఘునాథ్‌రెడ్డిని ఆప్యాయంగా పలుకరించి ఎథిక్స్ కమిటీ మెంబర్‌గా ఎంపికైనందుకు అభినందించారు.



గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సిద్దవటం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో ఫణిరాజకుమారి తెలిపారు.మంగళవారం మండలంలోని జంగాలపల్లె గ్రామంలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొని మాట్లాడారు. తడిచెత్త, పొడిచెత్త వేరు చేసి అందజేయాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలోమండల విస్తరణాధికారి మెహతాజ్ యాస్మిన్, గ్రామ సర్పంచ్ వెంకటమ్మ, పంచాయతీ కార్యదర్శి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

'అతుకుబడి'తో తంటా..!

అతుకుబడి పట్టా... ఈ పేరు దాదాపు ఎవరూ విని ఉండరు. రైతుల పట్టాదారు పాస్‌పుస్తకాల్లో అతుకుబడి అనే పేరు జిల్లాలోని రైల్వేకోడూరు నియోజకవర్గంలో కొత్తగా వినిపించింది. ఎలా జరిగిందో తెలియదు గాని రైతు పాస్‌పుస్తకాలను ఆన్‌లైన్ చేసే క్రమం లో రైల్వేకోడూరు రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న ఓ కంప్యూటర్ ఆపరేటర్ 2012లో అతుకుబడి అనే పేరును నమోదు చేసి రైతు పట్టాదారు పాసుపుస్తకాల్లో ముద్రించారు.

- రిజిస్ట్రేషన్‌కు నోచుకోని భూములు
- రైల్వేకోడూరులోనే 17 వేల పట్టాలు
- జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో ముమ్మరంగా కసరత్తు
- సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు

రైల్వేకోడూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రాగానే భూముల సర్వేపై రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త నిబంధలనతో ఈ అంశం తెరపైకి వచ్చింది. దీంతో రెవెన్యూ అధికారులు అతుకుబడి భూముల పై ప్రక్రియ ప్రారంభించారు. అతుకుబడి అని పట్టాదారు పాసు పుస్తకాలలో ఉంటే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో పలువురు రైతులు ఇబ్బందులు పడ్డారు. రైతు పట్టాదారు పాస్‌పుస్తకాల్లో జిరాయితీ అని ఉంటేనే రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. అతుకుబడి ఉంటే చేయడం లేదని ఇటు ప్రభుత్వానికి, అటు అధికారులకు రైతులు వినతులు ఇవ్వడం


రైల్వేకోడూరు రెవెన్యూ కార్యాలయంలో ఫ్రీహోల్డ్‌పై నివేదికలు తయారు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

తో ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. అతుకుబడి అని ఉంటే భూమి ఆన్‌లైన్ కరెక్షన్స్ కూడా చేయలేని పరిస్థితి ఏర్పడింది. గతంలో రైతుల పట్టాదారు పాస్ పుస్తకాల్లో అతుకుబడి, జిరాయితీ అనే పేర్లు లేవు. సాధారణంగా రైతు పాసు పుస్తకాల్లో భూమి సర్వే నెంబర్లు, విస్తీర్ణం, డీకేటీ అయితే డీకేటీ, పట్టా అయితే పట్టా ఇలా ఉండేవి. మళ్లీ పట్టాదారు పాస్ పుస్తకాల్లో రాజముద్రలు, స్టిక్కర్లు తదితరాల్లో రెవెన్యూ శాఖ మార్పులు తీసుకొచ్చింది. ఇవి ఉంటేనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో క్రయవిక్రయాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు జరిగేవి. ప్రస్తుతం రైతు పట్టాదారు పాసుపుస్తకాల్లో అతుకుబడి, జిరాయితీ అనే పదాలు కొత్తగా వినిపిస్తున్నాయి. ఇవి ప్రత్యేకించి రైల్వేకోడూరు నియోజకవర్గం లోనే ఉండటం విశేషం. దీంతో ఇటు అధికారులు, రైతులు తలలు పట్టుకున్నారు. రెవెన్యూ సదస్సుల్లో అత్యధికంగా అతు కుబడి పట్టాలు ఉన్న రైతులు తమకు విముక్తి కల్గించాలని విన్నపాలు చేసుకున్నారు. రెవెన్యూశాఖ దీనిపై ప్రభుత్వానికి నివేదిక పంపింది. దీంతో ప్రభుత్వం వెంటనే చర్యలు ప్రారంభించింది. రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడింది. జిల్లాలో ఎక్కడా లేనిది ఒక్క రైల్వేకోడూరు నియోజకవర్గంలోనే అతుకుబడి పట్టాలు ఉన్నాయని అధికారులు గుర్తించారు. దీనిని జిరాయితీగా ఎలా మార్చాలని



ఆన్‌లైన్‌లో కనిపిస్తున్న అతుకుబడి పట్టా

ప్రభుత్వం అధికారులతో చర్చించింది. సాధ్యాసాధ్యాలను జాయింట్ కలెక్టర్ పరిశీలించి రైల్వేకోడూరు తహసీల్దార్‌కు నివేదిక త్వరితగతిన ఇవ్వాలని ఆదేశించడంతో అతుకుబడి పట్టాల నివేదికలు కలెక్టర్ కార్యాలయానికి పంపారు. అతుకుబడి లేకుండా జిరాయితీ అనే పదంతో క్రయవిక్రయాలు జరిగే విధంగా జాయింట్ కలెక్టర్ ప్రత్యేకంగా చర్యలు తీసుకున్నారు. దీంతో త్వరలో రైతులకు తీపి కబురు రానుంది.

అతుకుబడి పట్టాలకు త్వరలోనే మోక్షం



అతుకుబడి పట్టాలకు త్వరలోనే మోక్షం లభిస్తుంది. భూముల క్రయవిక్రయాలు జరిగేందుకు వీలుగా తీసుకునే చర్యల్లో భాగంగా ఫ్రీహోల్డ్ భూములను గుర్తిస్తోంది. జిల్లా అధికారులు దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. దీంతో మేం కూడా ఫ్రీహోల్డ్ భూములపై నివేదికలు తయారు పంపాం.

\- మహబూబ్ చాంద్, తహసీల్దార్, రైల్వేకోడూరు


రీసర్వేపై రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రీసర్వే పక్కాగా చేయండి

● అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్

గుర్రంకొండ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వే పక్కాగా చేయాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ రెవెన్యూ సిబ్బందికి సూచించారు. గుర్రంకొండ తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో ఆయన మాట్లాడుతూ మండలంలో ఎన్ని వేల ఎకరాల భూములున్నాయి. అందులో డ్రై ల్యాండ్ ఎంత...? వెట్ ల్యాండ్ ఎంత? ఎన్ని గ్రామాల్లో రీ సర్వే చేస్తున్నారు, ఇప్పటి వరకు ఎన్ని ఎకరాల్లో సర్వే చేశారని తహసీల్దార్‌ని అడిగి వివరాలు సేకరించారు. మండలంలో 3,356 ఎకరాల్లో సర్వే చేయాల్సి ఉండగా, మూడు టీములు ఏర్పాటు చేసి రోజుకు 60 ఎకరాలు సర్వే చేసేలా ప్రణాళిక రూపొందించామని అధికారులు తెలిపారు. ప్రగతి సాధనలో వెనుకబడి ఉండడంతో సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విధులను సక్రమంగా నిర్వహించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై ఆరా తీశారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసులు, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

కోదండ రామాలయంలో దేవదాయశాఖ ఏసీ పరిశీలన

నందలూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అరవపల్లెలో ఉన్న కోదండరామాలయ పునర్నిర్మాణ పనులను మంగళవారం దేవదాయశాఖ అన్నమయ్య జిల్లా అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ పరిశీలించారు. ధూప, దీప, నైవేద్యం పథకం కింద అర్చకుడి నియామకానికి అనుకూలమైన పరిసితులపై ఆరా తీశారు. ధర్మకర్త గంపా సుధాకర్, నడివీధి సుధాకర్, ఆకుల చలపతి, నారపుశెట్టి వేణుగోపాల్, శివకుమార్‌పాల్గొన్నారు.

కారు, బస్సు ఢీకొని ఒకరి మృతి


సంఘటన స్థలంలో గుమిగూడిన జనం (ఇన్‌సర్ట్) జహీర్ మృతదేహం

కురబలకోట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కారును బస్సు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నా యి. కడప పట్టణానికి చెందిన జహీర్(27) రెడీమేడ్ దుస్తుల దుకాణాన్ని నిర్వహిస్తుంటాడు. మం గళవారం ఉదయం తన తమ్ముడు షామీర్‌తో కలిసి కారులో బెంగ ళూరులో దుస్తులు కొనడానికి బయలుదేరాడు. కురబలకోట మండ లం మద్యాహ్నంవారిపల్లె సమీపంలో వారి కారు, బస్సును ఢీకొంది.. ఈ ప్రమాదంలో జహీర్ అక్కడిక్కడే మృతి చెందాడు. గాయపడిన షామీర్‌ను 108 వాహనంలో మదనపల్లెలోని ప్రభుత్వాసుపత్రికి తర లించారు. ప్రమాదం కారణంగా రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముదివేడు పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య


చంద్రశేఖర్ రెడ్డి (ఫైల్‌ఫొటో)

సిద్దవటం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యం లో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు మండలంలోని తురకపల్లెకు చెందిన చంద్రశేఖర్ రెడ్డి (36) ఏడేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన సబీనా అనే మహిళను వివాహం చేసుకున్నాడు. కడపలో కూలి పనులు చేసేవాడు. అతను ఇంట్లోని పైకప్పునకు చీరతో ఉరి వేసుకున్నట్లు మంగళవారం ఉదయం 6 గంటలకు భార్య గుర్తించింది. మరో ఇద్దరు మహిళల సాయంతో అతనిని కిందికి దింపి చూడగా అప్పటికే మృతిచెందాడని ఆమె తెలిపింది. అప్పుల బాధ తాళలేక ఉరి వేసుకుని ఉంటాడని ఆమె పోలీసులకు తెలియజేసింది. మృతుడి తల్లి మల్లీశ్వరి మాట్లాడుతూ తన భార్య నీచంగా మాట్లాడుతూ వేధిస్తోందని, తనను చంపేస్తారంటూ ఫోన్ చేశాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

మారుతి వ్యాన్ బోల్తా.. ముగ్గురికి గాయాలు

గుర్రంకొండ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి మారుతి వ్యాన్ బోల్తాపడిన సంఘటన మంగళవారం సూరప్పగారిపల్లె సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు కర్ణాటక రాష్ట్రం చింతామణికి చెందిన నంజుండప్ప, ప్రకాశ్, హేమావతి అన్నమయ్య జిల్లా రాయచోటిలోని వీరభద్రస్వామిని దర్శించుకోవడానికి మారుతి వ్యాన్‌లో బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న వ్యాన్ గుర్రంకొండ మండలం చెర్లోపల్లె పంచాయతీ సూరప్పగారిపల్లె సమీపంలోని నయారా పెట్రోల్ బంకు వద్ద అడ్డుగా వచ్చిన ద్విచక్ర వాహనాన్ని తప్పించే యత్నంలో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మారుతి వ్యాన్‌లో ఉన్న నంజుండప్ప(45), ప్రకాశ్(35), హేమవతి(30)కి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో వాల్మీకిపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ మధు రామచంద్రుడు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో 11 మందికి..


మదనపల్లె ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

మదనపల్లె అర్బన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): దైవ దర్శనానికి వచ్చిన 11 మంది రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు.మదనపల్లెలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి అవుట్ పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు కర్ణాటక రాష్ట్రం దేవనహళ్లికి చెందిన వారు రాయచోటిలోని వీరభద్ర స్వామి దర్శనానికి బైక్‌లో బయలుదేరారు. గుర్రంకొండ మండలం, చెర్లోపల్లె సమీపంలోని పెట్రోల్ బంకులో బైక్‌లో పెట్రోల్ పోయించుకుని వేగంగా రోడ్డుపైకి వచ్చారు. అదే సమయంలో గుర్నంకొండ నుంచి వస్తున్న ఒమ్నీ వాహనం ఆ బైక్‌ను తప్పించబోయి అదుపుతప్పి బోల్తా పడింది. ఆ వాహనంలో ఉన్న 11మంది గాయాలు అయ్యాయి. స్థానికులు వారిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. గుర్రంకొండ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎనిమిది మందిపై అట్రాసిటీ కేసు

మదనపల్లె అర్బన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లరాజుగారిపల్లెకు చెందిన ఎనిమిది మందిపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు మదనపల్లె తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. మదనపనల్లె మండలం, నల్లరాజుగారిపల్లెకు చెందిన ముని వెంకటరమణ(69)తన పొలంలో ఇల్లు నిర్మించుకుంటుండగా గత నెల 17వ తేదీన అదే గ్రామానికి చెందిన బాలకృష్ణనాయుడు, కళావతి, రవినాయుడు, నారాయణ, ఆదెమ్మ, శ్రీనివాసులు నాయుడు, సోముశేఖర్‌నాయుడు, సంజు పనులు అడ్డుకుని దాడి చేశారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేసి ఎస్టీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

జలవనరుల శాఖ డీఈఈలకు పదోన్నతులు

కలికిరి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కడప, అన్నమయ్య జిల్లాల్లో జలవనరుల శాఖలో వివిధ విభాగాల్లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా పనిచేస్తున్న 16 మందికి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పదోన్నతులు పొందిన వారిలో కడప ఇరిగేషన్ సర్కిల్‌లో అన్నమయ్య డివిజన్ నారమరాజుపల్లె సబ్ డివిజన్-3 డీఈఈగా పనిచేస్తున్న ఎల్.జయచంద్రా రెడ్డి, విజయవాడ హైడ్రాలజీ (ఇన్వెస్టిగేషన్) విభాగంలో కడప ఆర్వోక్యూఎల్-2 డీఈఈగా వున్న ఎం.పి.విజయకుమార్, కడప కన్‌స్ట్రక్షన్ సర్కిల్-3 విభాగంలో పులివెందులలో జీఎన్ఎస్ఎస్ సబ్ డివిజన్-12లో డీఈఈగా పని చేస్తున్న ఎల్.గోపాల్ రెడ్డి, తిరుపతి తెలుగు గంగ, జీఎన్ఎస్ఎస్ సర్కిల్ పరిధిలోని రేణిగుంట డివిజన్‌కు సంబంధించి కోడూరు సబ్ డివిజన్ డీఈఈ ఎస్.రవిశంకర్ రెడ్డి, కడప జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీరు (ప్రాజెక్టులు) కార్యాలయ డీఈఈ ఎం.జనార్దన్, హంద్రీ నీవా సుజల స్రవంతి మదనపల్లె సర్కిల్-3 పరిధిలోని ఎమ్మిగనూరు సబ్ డివిజన్ డీఈఈ ఎస్.మురళి, ఇదే సర్కిల్-3 కదిరి సబ్ డివిజన్-1లో ఎస్.సురేంద్రనాథ రెడ్డి, తిరుపతి తెలుగ గంగ ప్రాజెక్టు సర్కిల్ పరిధిలోని మదనపల్లె టీజీపీ క్వాలిటీ కంట్రోల్ విభాగంలో డి.శ్రీనివాస రెడ్డి ఉన్నారు. ఇంకా ఎస్‌కేడీ జీఎన్ఎస్ఎస్ కడప సర్కిల్‌కు చెందిన కడప మామిళ్లపల్లె సబ్ డివిజన్-2 డీఈఈ ఎస్.రావి రెడ్డి, కోస్టల్ రీజియన్ ఈపీఈఆర్ఎల్ కడప డివిజన్ డీఈఈ ఎస్.రవిచంద్రన్, ఎన్టీఆర్ టీజీపీ కడప సర్కిల్ పోరుమామిళ్ల డీఈఈ ఎస్.ఉమామహేశ్వర రావు, ఎస్‌కేడీ జీఎన్ఎస్ఎస్ కడప సర్కిల్, మామిళ్లపల్లె సబ్ డివిజన్-1 డీఈఈ వి.వెంకటేశ్వర్లు, ఎన్టీఆర్ టీజీపీ పోరుమామిళ్ల సబ్ డివిజన్-4 డీఈఈ పి.కృష్ణారెడ్డి, జీఎన్ ఎస్ఎస్ కడప సర్కిల్ ఎర్రగుంట్ల సబ్ డివిజన్-4 డీఈఈ ఇ.జయరాము, ఎన్టీఆర్ టీజీపీ పులివెందుల సబ్ డివిజన్-3 డీఈఈ ఎస్.ఈశ్వరయ్య, జీఎన్ఎస్ఎస్ పులివెందుల డివిజన్ కొండాపురం సబ్ డివిజన్-4 డీఈఈ పోతిరెడ్డి ప్రసూనాదేవి ఉన్నారు. వారందరూ పదిహేను రోజుల్లోగా ఆయా విధుల్లో చేరాలం టూ రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పక్కా గృహాల నిర్మాణాలు పూర్తి చేయాలి

● హౌసింగ్ పీడీ శివయ్య

లక్కిరెడ్డిపల్లె, మార్చి 18(ఆంధ్రజ్యోతి):అర్ధాంతరంగా ఆగిపోయిన పక్కా గృహాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ శివయ్య సూచించారు. మంగళవారం మండలంలోని అనంతపురం, హరిజనవాడ, వడ్డెపల్లె, చౌటపల్లెల్లో అసంపూర్తిగా ఉన్న పక్కా గృహాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ ఆర్థిక స్థోమత లేక ఇల్లు నిర్మించుకోలేని ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు ప్రభుత్వం అదనంగా రూ.50 వేలు, ఎస్టీలకు రూ. 75 వేలు ఇస్తోందన్నారు. పనులు మొ దలు పెట్టిన వెంటనే బిల్లులు ఇస్తామన్నారు. పలువురు లబ్ధిదారులు ప్రభుత్వం ఇస్తున్న అదనపు బిల్లుకు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. అసంపూర్తిగా ఉన్న పక్కా ఇళ్ల నిర్మాణాల పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం 350 కోట్ల రూపాయలు మంజూరు చేసిందన్నారు. పక్కాగృహాలు లేని అర్హులైన నిరుపేదలు 2025-26కు సంబంధించిన


లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ శివయ్య

పక్కాగృహాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. గ్రామ సచివాలయాలు, మండల హౌసింగ్ కార్యాలయంలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఈ ఏడాది మంజూరు చేసే ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం 4,30 లక్షల రూపాయలు ఇస్తుందన్నారు. దరఖాస్తుదారులు ఎస్సీ, ఎస్టీ, బీసీలు తప్పకుండా కులం, ఆదాయం ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హౌసింగ్ ఏఈలు జనార్దన్,అంజి పాల్గొన్నారు.

పొసెషన్ సర్టిఫికెట్ తప్పనిసరి

పెద్దతిప్పసముద్రం మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరు చేసే గృహనిర్మాణాలకు పొసెషన్ సర్టిఫికెట్ తప్పని సరి అని హౌసింగ్ డీఈ వెంకటరెడ్డి వెల్లడించారు. మంగళవారం ఆయన హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్‌తో కలిసి మండలంలోని వివిధ గ్రామాల్లో గృహ నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం స్థానికులతో మాట్లాడుతూ సొంత స్థలం కలిగి ఉన్న వారికి గృహాలు మంజూరు చేస్తామన్నారు. అలాంటి వారు రెవెన్యూ అధికారుల నుంచి పొసెషన్ సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగింపు

● జూనియర్ ఇంటర్ అర్హత పరీక్ష తేదీలో మార్పు

కలికిరి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మహాత్మ జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు పంపుకోవడానికి గడువు పొడిగించినట్లు జిల్లా కన్వీనరు వై.సోమశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తులు పంపుకోవడానికి గతంలో మార్చి 15వ తేదీ చివరి తేదీగా ప్రకటించగా తాజాగా గడువు తేదీని ఈనెల 25 వరకు పొడిగించారు. బీసీ గురుకుల పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతుల్లో బ్యాక్ లాగ్ సీట్ల భర్తీ కోసం, 5వ తరగతిలో పూర్తి సీట్ల భర్తీ కోసం ఈ గడువు పొడిగించినట్లు ఆయన తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని సదుం బీసీ బాలుర జూనియర్ కళాశాలతోపాటు సదుం, కుప్పం (బాలురు), పెద్దపంజాణి, పులిచెర్ల (బాలికలు) బీసీ గురుకుల పాఠశాలల్లోనూ, తిరుపతి జిల్లాలోని సత్యవేడు, ఐతేపల్లె (బాలురు) ఉదయమాణిక్యం (బాలికలు) తంబళ్లపల్లె (బాలురు), కలికిరి, పీలేరు (బాలికలు) పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు పంపుకోవాలన్నారు. గతంలో జూనియర్ ఇంటర్ ప్రవేశాలకు ఏప్రిల్ 20వ తేదీ ప్రవేశ పరీక్షలు జరగాల్సి ఉండగా తాజాగా దానిని మే 4వ తేదీకి మార్చినట్లు చెప్పారు. అయితే 5వ తరగతి ప్రవేశాలకు గతంలో ప్రకటించిన విధంగానే ఏప్రిల్ 27న, బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీకి అంటే 6, 7, 8, 9వ తరగతులకు ఏప్రిల్ 28న యథాప్రకారం ప్రవేశ పరీక్షలు జరపనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు పంపుకోవాలని కోరారు. ఇతర వివరాలు లేదా సందేహాల కోసం 90007 15637. 87900 92069, లేదా 79894 45396 నంబర్లలో సంప్రదించాలని కన్వీనరు సోమశేఖర్ కోరారు.

మహిళా శిశు సంక్షేమ అధికారిగా అనూరాధ

కలికిరి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారిత అధికారి నియామకంలో స్వల్పంగా మార్పులు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పోస్టులో గుంటూరు జిల్లా ఫిరంగిపురం ఏసీడీపీవోగా పనిచేస్తున్న పి.అనూరాధను వర్క్ డెప్యుటేషన్ ప్రాతిపదికపై మహిళా శిశు సంక్షేమ సాధికారిత అధికారిగా ఈ నెల 5న నియమించినట్లు తెలిసింది. తాజాగా తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు రెగ్యులర్ అధికారిగా నియమిస్తూ ఆ శాఖ కార్యదర్శి ఎ.సూర్యకుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

బకాయిలు చెల్లించకపోతే చర్యలు

వాల్మీకిపురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): బకాయిలు చెల్లించనివారిపై చట్ట పర చర్యలు ఉంటాయని వాల్మీకిపురం మండలం చింతపర్తి పంచాయతీ సెక్రటరీ రెడ్డిశేఖర్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆయన విలేకరులతో మా ట్లాడుతూ చింతపర్తి పంచాయతీలోని ప్రైవేట్ బస్టాండ్, వారపు సంతల్లో సెస్సు వసూలు హక్కులు పొందినవారు 15 ఏళ్లుగా పూర్తి స్థాయిలో డబ్బు చెల్లించలేదన్నారు. పంచాయతీ ఆదాయాన్ని సమకూర్చే లక్ష్యంతో డిపాజిట్లను వారపు సంతకు రూ.4.5లక్షలు, ప్రైవేట్ బస్టాండ్‌కు రూ.90 వేలు నిర్ణయించామన్నారు. 2025-26 సంవత్సరానికి వారపు సంత రూ.6. 15 లక్షలు, ప్రైవేట్ బస్టాండ్‌కు రూ.95 వేలకు వేలం నిర్వహించి వారి నుంచి పూర్తి డబ్బును వసూలు చేశామన్నారు ఇకముందు కూడా ఇలాగే కొనసాగుతాయని తెలియజేశారు.

చేపల చెరువుతో రూ.2.60లక్షల ఆదాయం

ములకలచెరువు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): బట్నాయని చెరువు వేలం ద్వారా రూ. 2,60,500 ఆదాయం వచ్చింది. మద్దినాయనిపల్లె పంచాయతీ కార్యాలయంలో మంగళవారం చెరువులో చేపల పెంచుకునే హక్కులకు మదనపల్లె డీఎల్‌పీఓ నాగరాజు అధ్యక్షతన వేలం నిర్వహించారు. నరసింహులు హక్కు దక్కించుకున్నారు.

సచివాలయం సర్వేయర్ సస్పెన్షన్

బి.కొత్తకోట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): గుమ్మసముద్రం సచివాలయం సర్వేయర్‌గా పనిచేస్తూ ఇటీవల పీటీఎం మండలం టి.సదుం సచివాలయానికి బదిలీపై వెళ్లిన ఎస్. రాజేంద్రను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకు న్నారు. ఈ మేరకు చిత్తూరు జిల్లా భూ సర్వే అధికారి జయరాజ్ నుంచి మం గళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. గుమ్మసముద్రం సచివాలయం సర్వేయర్‌గా పని చేస్తూ తన తల్లి పేరున అక్రమంగా నాలుగు ఎకరాల భూమిని ఆన్‌లైన్ చేయించుకోవడం, అనేక అక్రమాలు చేసినట్లు ఫిర్యాదులపై ప్రాథమిక చర్యలో భాగంగా ఇతన్ని సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది. విచారణ అనంతరం తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు సమాచారం

సేద తీరుస్తున్న తాటికల్లు



- వేసవి తీవ్రత నుంచి ఉపశమనం
- కార్మికుల కుటుంబాలకు ఉపాధి
- పెరిగిన డిమాండ్

రాజంపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో కల్లుకు డిమాండ్ పెరుగుతోంది. దీంతో గీత కార్మికులు కల్లు వ్యాపారంపై దృష్టి పెట్టారు. మార్చి నెల ఆరంభం నుంచి వేసవి తీవ్రత పెరుగుతూ ఉండడంతో దానికితగ్గట్లు కల్లు తీయడం ప్రారంభించారు. నందలూరు, రాజంపేట, సిద్దవటం ప్రాంతాల్లోని చెరువు గట్లు, ఊరి పొలిమేరలు, ఏటిగట్లు, పొలాల చుట్టూ, చెయ్యేరు, పెన్నానది పరివాహక ప్రాంతాల్లో వేలాదిగా తాటిచెట్లు ఉన్నాయి. ఒక్కొక్కరికీ పదుల కొద్ది తాటిచెట్లు ఉండడంతో వాటినుంచి కల్లు గీత, తాటి ముంజెల సేకరణ విక్రయం ద్వారా ఉపాధి పొందుతూ, లాభాలు గడిస్తుంటారు. ఈ సీజన్‌లో గీత కార్మికులు అధికంగా కల్లు గీయడం, గీసిన కల్లును కూడలి ప్రాంతంలో విక్రయించడంలో నిమగ్నమవుతారు. స్వచ్ఛమైన తాటికల్లు ఒక లీటరు 100 రూపాయలు చొప్పున అమ్ముకుంటారు. ఒక్కో చెట్టుకు రోజూ 3 నుంచి 5 లీటర్ల వరకు కల్లు వస్తుంది. ఇలా 5 చెట్లను గీస్తే కనీసం 15 నుంచి 20 లీటర్లు వరకు దిగుబడి వస్తుంది. దీని విక్రయం ద్వారా వచ్చే సొమ్ముతో కల్లుగీత కార్మికులు వేసవిలో కుటుంబాలను పోషించుకుంటున్నారు. ప్రస్తుతం పల్లె ప్రాంతాల్లో సుమారు 200 మంది పైబడి కార్మికులు ప్రస్తుతం ఈ పనిలో నిమగ్నమయ్యారు. చెయ్యేరు నది పరివాహక ప్రాంతాలైన నందలూరు, కుమ్మరపల్లె, ఇసుకపల్లె, నాగిరెడ్డిపల్లె, లేబాక, ఓబిలి, పొత్తపి, టంగుటూరు, నల్లతిమ్మాయపల్లె, మందరం, నారాయణ నెల్లూరు, తాళ్లపాక, మదనగోపాలపురం, గుండ్లూరు, శేషమాంబపురం, రామచంద్రాపురం తదితర ప్రాంతాల్లో తాటిచెట్లు భారీగా ఉన్నాయి. ప్రస్తుతం 10 రోజులుగా తాటిచెట్ల నుంచి విరివిగా కల్లును గీస్తున్నారు. మరో 15 రోజుల్లో తాటిముంజలు కూడ పండనున్నాయి. దీంతో రెండు రకాలుగా వీరికి లాభం చేకూరనుంది. రాను రాను తాటిచెట్లు తగ్గిపోతుండడంతో కల్లు వ్యాపారం కూడా తగ్గిపోతోంది.


కల్లు విక్రయిస్తున్న గీత కార్మికుడు

ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే తెలపండి


నేతలతో మాట్లాడుతున్న ఈఆర్వో రాఘవేంద్ర

తంబళ్లపల్లె, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాలో పొరపాట్లు, మార్పులు, చేర్పులు వంటివి ఉంటే రాజకీయ పార్టీల నేతలు తెలపాలని ఈఆర్వో రాఘవేంద్ర సూచించారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆరు మండలాల ఏఆర్వోలు, రాజకీయ పార్టీల నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాబితాపై అభ్యంతరాలుంటే వెంటనే తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ఎన్నికల ప్రక్రియను బలోపేతం చేసేందుకు, పరస్పర అనుకూల సలహాలు, సూచనలు అందించేందుకు రాజకీయ పార్టీలకు ఎన్నికల కమిషన్ అవకాశం ఇచ్చిందన్నారు. తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఆరు మండలాల ఏఆర్వోలు హరికుమార్, ప్రదీప్, సయ్యద్, శ్రీరాములు, అజార్, తపస్విని, సిబ్బంది కిషోర్, దినకర్, టీడీపీ, జనసేన, బీజేపీ, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

దేవదాయ భూముల్లో అక్రమ నిర్మాణాలను అడ్డుకోండి


సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌కు వినతిపత్రం ఇస్తున్న బీవైఎస్ నేతలు

మదనపల్లె టౌన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): దేవదాయ భూముల్లో అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ విన్నవించారు. మంగళవారం స్థానిక సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌ను కలిసిన బీవైఎస్ నేతలు మాట్లాడుతూ పట్టణం సహా మండలంలో పలుచోట్ల ఉన్న రూ.కోట్ల విలువైన దేవదాయ భూములను కొందరు ఆక్రమించుకుని లేఅవుట్లు వేసి విక్రయించేశారన్నారు. ప్రస్తుతం దేవదాయ భూముల్లో షాపింగ్ గదులు నిర్మిస్తున్నారన్నారు. ఈ విషయమై ఇది వరకే ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని, ఆయన మదనపల్లె రెవెన్యూ అధికారులకు లేఖ రాశారన్నారు. ఈ లేఖ సారాంశాన్ని పరిశీలించి దేవదాయ భూములను కాపాడాలని పునీత్ సబ్‌కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో బీవైఎస్ నేతలు జిలాని బాషా, ఆది, శశికుమార్, ద్వారక, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

21న ఉపన్యాస పోటీలు

కడప కల్చరల్ మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో ప్రసంగించే అవకాశం కోసం యువతకు ఈ నెల 21న శుక్రవారం కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కాలేజీలో ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కె.మణికంఠ వెల్లడించారు. మంగళవారం బాలాజీనగర్‌లోని నెహ్రూ యువ కేంద్రం కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కడప, అన్నమయ్య జిల్లాల్లో 18 నుంచి 25 ఏళ్ల మధ్య వయసు గల యువతీ యువకులు ఈ ఉపన్యాస పోటీల్లో పాల్గొన వచ్చన్నారు. ఇందులో ప్రధానంగా వన్‌నేషన్, వన్ ఎలక్షన్ అనే అంశంపై ఉపన్యాస పోటీలో ఉంటాయన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన విజేత రాష్ట్ర, దేశస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు ప్రశంసాపత్రం అందిస్తారన్నారు. ఇతర వివరాలకు 9177616677 అనే నెంబరును సంప్రదించాలని సూచించారు.

రేపు చేతివృత్తుల సంఘం నాయకులతో సమావేశం

కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆదరణ-3 పథకం ద్వారా కుల వృత్తికి అవసరమైన ఆధునిక పనిముట్లు కోసం జిల్లాలోని బీసీ కుల, చేతివృత్తుల సంఘ నాయకులకు ఈనెల 20న ఉదయం 11గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ జయ సింహ ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి హాజరవుతున్న బీసీ నాయకులు తమ సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. నాయీ బ్రాహ్మణ, రజక, వడ్డెర, మత్స్యకారుల, చేనేత, వడ్రంగి, స్వర్ణకారుల, కల్లుగీత కార్మికులు, కుమ్మరి, మేర, వాల్మీక బోయ, కృష్ణబలిజ, పూసల, సగర, ఉప్పర, శిల్పులు, కరెంటు పని, పాల వ్యాపారం చేసేవారు, ప్లంబర్లు తదితర చేతివృత్తులు చేసుకునే బీసీ కులాలకు చెందిన నాయకులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

24న గోవిందమాంబ ఆరాధన మహోత్సవాలు


వీరబ్రహ్మేంద్రస్వామి సమేత గోవిందమాంబ

బ్రహ్మంగారిమఠం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం దేవస్థానంలో ఈ నెల 24వ తేదీ గోవిందమాంబ ఆరాధన మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఫిట్ పర్సన్ శంకరబాలాజీ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాతా గోవిందమాంబ ఆరాధన మహోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు, సాయంత్రం భజన కార్యక్రమాలు, రాత్రికి గ్రామోత్సవం ఉంటుందన్నారు. భక్తులు ఆరాధన మహోత్సవాల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

కేబుల్ ఆపరేటర్ల సమస్యల పరిష్కారానికి కృషి

కడప(వినాయకనగర్), మార్చి18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఏపీ ఫైబర్‌నెట్ కేబుల్ ఆపరేటర్ల సమస్యలు సీఎం చంద్రబాబునాయుడి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని మాజీ మంత్రి పీతల సుజాత పేర్కొన్నారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రతిరోజు జరిగే గ్రీవెన్‌సెల్ కార్యక్రమానికి మంగళవారం ఏపీ ఫైబర్‌నెట్ కేబుల్ ఆపరేటర్ల జేఏసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నాగిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఛైర్మన్ నారాయణరావు, కార్యదర్శి కమ్మలపాటి సురేశ్‌బాబులు వెళ్లి మంత్రి వినతి పత్రం అందజేశారు. స్పందించి సుజాత వెంటనే సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు జేఏసీ నాయకులు తెలిపారు.

వల్లూరు యువకుడికి అరుదైన గౌరవం

వల్లూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్ననాగిరెడ్డిపల్లె లేబాక నరసింహారెడ్డి జాతీయ బుక్ ఆఫ్ రికార్డుల్లో ప్రత్యేక స్థానం సాధించాడు. తెలంగాణ బాష సంస్కృతీ శాఖ సౌజన్యంతో వెంకీ మ్యూజికల్ అకాడమీ వారి ఆధ్వర్యంలో ఈ నెల 16న హైదరాబాదులో 16గంటల పాటు సుమారు పది బాషల్లో నిరంతరాయంగా పాటలు పాడే పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచి జాతీయ బుక్ ఆఫ్ రికార్డుల్లో మరియు జీనియస్ బుక్ ఆఫ్ రికార్డుల స్థానం దక్కించుకున్నాడు. ఈ అవార్డును సమస్త అధినేత వెంకటేశ్ చేతుల మీదుగా అందుకున్నాడు.

12 మంది బెయిలుపై విడుదల

కడప క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో వీరభద్రస్వామి ఉత్సవాల సందర్భంగా రెండు వర్గాల మధ్య తలెత్తిన వివాదంపై ఈ నెల 9న పోలీసులు కొంత మందిని అరెస్టు చేశారు. వీరికి కోర్టు రిమాండ్ విధించడంతో కడప సెంట్రల్ జైలులో ఉన్నారు. వీరిలో 12 మంది మంగళవారం బెయిలుపై విడుదలయ్యారు. విడుదలైన వారికి వారి బంధువులు స్వాగతం పలికారు.

ఒకే ఒక్కడు

- విభాగాలు ఐదు...అధికారి ఒక్కరు
- కొరవడుతున్న పర్యవేక్షణ
- అస్తవ్యస్తంగా సహకార వ్యవస్థ



కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా ప్రభుత్వ రంగ వ్యవస్థలో ఒక్కో విభాగానికి ఒక అధికారి ఉండడం నిబంధన. కానీ జిల్లాలోని సహకార వ్యవస్థలో ఐదు విభాగాలకు ఒకే అధికారి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో ఆశాఖపై పర్యవేక్షణ పూర్తిస్థాయిలో కొరవడుతోంది. ఇక ఆ అధికారి కూడా ఇన్‌చార్జి కావడంతో పాలన అస్తవ్యస్థంగా తయారవుతోంది. వివరాల్లో కెళితే...

జిల్లా సహకార శాఖ అధికారి సుబాషిణి కొన్ని నెలల క్రితం పదవీ విరమణ చేశారు. కడప డివిజన్ కోఆపిరేటివ్ అధికారిగా పని చేస్తున్న ఆమె జిల్లా సహకారశాఖ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టడం జరిగింది. ఆమె పదవీ విరమణ తర్వాత ప్రొద్దుటూరు డివిజనల్ కోఆపరేటివ్ సహకారశాఖ అధికారికి కడప డీఎల్సీఓగా, కడప జిల్లా సహకారశాఖ అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇవి కాకుండా కడపలోని హౌస్ బిల్డింగ్ సొసైటీ, జిల్లా కోఆపరేటివ్ ఆడిట్ అధికారి పోస్టులు కూడా ఆయనకే అప్పగించారు. ఈక్రమంలో ఒక అధికారి ఆయా శాఖలకు సంబంధించి పూర్తిస్థాయిలో విధులు నిర్వహించలేని పరిస్థితి. దీంతో ఒక్కో కార్యాలయానికి వారానికి ఒకరోజు కేటాయించినా కూడా ఏ పనిపై సమగ్రంగా దృష్టిసారించలేని పరిస్థితి.

కొరవడుతున్న పర్యవేక్షణ

సహకారశాఖ చాలా కీలకమైనది. వేలాది కుటుంబాలకు జీవనాధారమైన చేనేతరంగం, సహకార బ్యాంకింగ్ వ్యవస్థ, రైతులకు సేవలు అందించేందుకు పనిచేస్తున్న వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాలు, మాక్స్ చట్ట పరిధిలో పనిచేస్తున్న సంఘాలు, పలు రకాల సొసైటీలకు ప్రయోజనాలు కల్పించేందుకు జిల్లా సహకారశాఖ అధికారి పాత్ర చాలా కీలకమైంది. కానీ ఈ పోస్టు సంవత్సరాల తరబడి ఇన్‌చార్జి అధికారుల పాలనలో కొనసాగుతోంది. జిల్లా కేంద్రంలోని డివిజనల్ సహకార శాఖ అధికారి పోస్టు కూడా ప్రస్తుతం ఇన్‌చార్జి అధికారి పాలనలోనే ఉంది. సహకార వ్యవస్థలోని సొసైటీలు సంఘాలకు సంబంధించిన నిర్వహణ బాధ్య తలను పర్యవేక్షించాల్సిన ఆడిట్ అధికారి పోస్టు కూడా ఖాళీగా ఉం ది. సంఘాల పనితీరుపై సమగ్రంగా ఆడిటింగ్ పనులను పర్య వేక్షించేందుకు రెగ్యులర్ అధికారి లేకపోవడంతో ఇబ్బందికరమైన పరిస్థతులు కనిపిస్తున్నాయి. దీంతో చాలా వరకు సొసైటీల్లో ఉద్యో గ నియామకాల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారంటూ ఆడిటింగ్ అధికారులు నోటీసులు ఇచ్చారు. అదేవిధంగా పలు సొసై టీల్లో అక్రమాలు జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ కుంటు పడుతోంది. ఇక సహకార హౌస్‌బిల్డింగ్ సొసైటీలో రెగ్యులర్ అధి కారి అందుబాటులో లేకపోవడంతో అక్కడ పనులు ఆశించినంత మేర జరగడం లేదనేది స్పష్టం అవుతుంది.

పదోన్నతుల కోసం ఏళ్ల తరబడి నిరీక్షణ

సహకారశాఖలో అధికారులు పదోన్నతుల కోసం దాదాపు దశాబ్దాల తరబడి నిరీక్షస్తున్నారు. ఉన్నతాధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నా, పదోన్నతులకు అర్హులైన అధికారులు ఉన్నప్పటికి సహకారశాఖ, ప్రభుత్వాలు ఆ దిశగా తగిన చర్యలు తీసుకోకపోవడంతో అధికారులు కూడా నిరాశ నిస్పృహలో ఉన్నారు. దీంతో కీలకమైన శాఖలో సమర్థవంతమైన అధికారులు రెగ్యులర్‌గా లేకపోవడం వల్ల ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సహకార శాఖలో అధికారులకు పదోన్నతులు కల్పించే దిశగా అడుగులు పడుతున్నట్లు తెలుస్తోంది. జోన్, జిల్లాస్థాయిలో అధికారుల సర్వీసు, రోస్టర్ పాయింట్ ఆధారంగా పదోన్నతులు సంబంధించిన సీనియారిటీ జాబితాను రూపొందించినట్లు తెలు స్తోంది. త్వరితగతిన సహకార శాఖలో అదికారులకు పదోన్నతులు కల్పిస్తే రెగ్యులర్ అధికారులకు అదనపు బాధ్యతలు తప్పే పరిస్థితి లేకపోలేదు. ప్రభుత్వం, సహకార శాఖ ఉన్నతస్థాయి అధికార యంత్రాంగం పదోన్నతుల విషయంలో దృష్టిసారించి సహకార వ్యవస్థను గాడిలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అధికారిక ఉత్తర్వులు గౌరవించక తప్పదు

అధికారిక ఆదేశాల మేరకు నడుచుకుంటూ వారి ఉత్తర్వులను గౌరవించడం ప్రతి అధికారికి తప్పదు. ప్రస్తుతం సహకార వ్యవస్థలో కంప్యూటరీకరణ జరుగుతోంది. జిల్లాలో దాదాపు 60శాతం పూర్తయింది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాతనే మిగతా పనులు ఏవైన జరిగే అవకాశాలు ఉన్నాయి.

- సురేష్‌కుమార్, జిల్లా సహకార శాఖ అధికారి (ఎఫ్ఏసీ)

'ఉపాధి'లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవు

- డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి

చక్రాయపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథ కంలో అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాత్రి చక్రాయపేటలో సామాజిక తనిఖీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చక్రాయపేట మండలం కరువుకాటకాలకు నిలయమని, భూగర్భజలాలు అడుగంటి నీటి ఎద్దడి ఏర్పడిందన్నారు. రాబోయే రోజుల్లో నీటి గుంతలకు, ఫారం పాండ్స్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. త్వరలో జిల్లాలో ఉపముఖ్యమంత్రి పర్యటిస్తున్నారని, చక్రాయ పేట కు వచ్చే అవకాశం ఉందన్నారు. అనంతరం మండలంలోని 14 గ్రామాల వారీగా ఉపాధి పనులకు సంబంధించి రికార్డులు పరిశీలించి రూ.55,227 రికవరీ చేశామన్నారు. రూ.71వేలు జరిమానా విధించామన్నారు. అలాగే హౌసింగ్, పంచాయ తీరాజ్ శాఖలకు సంబంధించి రూ.1.53 లక్షలు జరిమానా విధించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ సోమ శేఖర్‌రెడ్డి, డీఈ రామలింగేశ్వర్ రెడ్డి, క్వాలిటీ ఈఈ విజయ భాస్కర్, ఏపీఓ గంగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ప్రభుత్వ భూముల కబ్జా

- అఖిలపక్ష ఐక్యవేదిక కన్వీనర్ ఆంజనేయులు


కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలిస్తున్న అఖిలపక్ష నాయకులు

సీకేదిన్నె, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కడపలో గత అయిదు సంవత్సరాల్లో నగరం చుట్టుపక్కల ప్రాంతాల్లో భూ మాఫియా పెట్రేగిపోయిందని అఖిలపక్ష ఐక్యవేదిక కన్వీనర్ కారు అంజనేయులు తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం ఊటుకూరు సర్వే నంబరు 235-2లో ఉన్న 42.75 ఎకరాల ప్రభుత్వ భూమిని మంగళవారం అఖిలపక్ష నాయకులతో కలిపి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడపలో భూకబ్జాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని, ప్రభుత్వ భూమి ఖాళీగా కనపడితే అధికారులను మేనేజ్ చేసి భూదందా కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారబలంతో కోట్ల విలువచేసే భూములను తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి సొంతం చేసుకుంటున్నారన్నారు. తాము పరిశీలించిన భూమిలో 42.75 ఎకరాలకు 36.95 ఎకరాలభూమి ఉందని.. అయిదు ఎకరాలకుపైగా కబ్జాకు గురైందన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు అవ్వారు మల్లికార్జున, పుత్తా శివారెడ్డి, రామాంజనేయులు, దేవరకృష్ణ, సీఆర్‌వీ ప్రసాద్, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న పెట్రోల్ ట్యాంకర్... డ్రైవర్ మృతి


మృతి చెందిన డ్రైవర్

ఎర్రగుంట్ల, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్లలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఖాదరయ్య (41) అనే డ్రైవర్ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.... సత్యసాయి జిల్లా ఎన్‌పీ కుంటకు చెందిన ఖాదరయ్య హిందూస్థాన్ పెట్రోలియం (హెచ్‌పీ)కార్పొరేషన్‌లో ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గుత్తిలో ట్యాంకర్‌కు పెట్రోల్ లోడ్ చేసుకుని కడప వైపు బయలుదేరాడు. ఎర్రగుంట్ల మైహోం సమీపంలోకి రాగానే ముందువెళుతున్న లారీని వేగంగా ఢీకొంది. దీంతో ట్యాంకర్ లారీలోకి చొచ్చుకు పోయి డ్రైవర్ ఖాదరయ్యకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి- కేసు నమోదు

కొండాపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మా పురం క్రాస్ వద్ద వ్యక్తిపై దాడి చేసిన సంఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానిక తిమ్మాపురం క్రాస్ వద్ద సింహాద్రి పురం మండలం బిదినంచెర్ల గ్రామానికి చెందిన నరసింహులుపై అనంతపురం జిల్లా సజ్జలదిన్నెకు చెందిన లక్షుమయ్య, చిరంజీవిలు దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సమష్టి కృషితో విద్యుత్ ప్రమాదాల నివారణ


మాట్లాడుతున్న ఎస్ఈ రమణ

కమలాపురం రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాలను సమష్టి కృషితో నివారించవచ్చని విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీరు ఎస్.రమణ తెలిపారు. కమలాపురంలోని మున్సిపల్ ఆఫీసు ఎదురుగా మంగళవారం రాత్రి విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వ హించారు. విద్యుత్ ప్రమాదాల వల్ల కలిగే నష్టాలను షార్ట్‌ఫిలిం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రమణారెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కిరణ్, అసిస్టెంట్ ఇంజనీరు చాంద్‌బాషా, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా పేరు మార్చడం హర్షణీయం

- ప్రజల మనోభావాలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం
- టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఇ.హరిప్రసాద్


విలేకరులతో మాట్లాడుతున్న హరిప్రసాద్

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ జిల్లా పేరును వైఎస్సార్ కడప జిల్లాగా పేరు మార్చడం పట్ల జిల్లా ప్రజలు హర్షిస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి బి.హరిప్రసాద్ అన్నారు.

మంగళవారం హరటవర్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కడపకు ఎంతో చరిత్ర ఉందని.. తిరుమల తొలి గడప కడప అని.. మత సామరస్యానికి ప్రతీక అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా ప్రజల మనోభావాలను అర్థం చేసుకొని మంత్రివర్గ సమావేశంలో వైఎస్సార్ జిల్లా పేరు ను వైఎస్సార్ కడప జిల్లాగా మారుస్తూ తీసుకున్న నిర్ణయం పట్ల జిల్లా ప్రజలందరు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం ఎంతో చరిత్ర కలిగిన కడప జిల్లాను వైఎస్సార్ జిల్లాగా పేరు మార్చిందని.. అప్పటి నుంచి ఎన్నో ఆందోళనలు చేసినా పట్టించుకోలేదున్నారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం పేరు మారుస్తూ నిర్ణయం తీసు కుందని.. అందుకు జిల్లా ప్రజల తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు నాగరాజు, గంధం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యం... బాలచంద్రుడు ఆదర్శం


జీవామృతం తయారు చేస్తున్న రైతు

చెన్నూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకంతో భూమి నిస్సారమై.. ఏ పంట సాగు చేసినా పెట్టిన పెట్టుబడులు రాక విసిగిపోతున్న రైతన్నల పరిస్థితులను కళ్లారచూసిన ఆయనను ఆలోచనల్లో పడేశాయి. ఈ నేపథ్యంలో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే దిశగా రైతు బాలచంద్రుడు ప్రకృతి వ్యవసాయానికి శ్రీకారం చుట్టారు. 2018లో నాటి టీడీపీ ప్రభుత్వ హయాంలో గుంటూరులో నిర్వహించిన జీరో బడ్జెట్ ప్రకృతి వ్యవసాయంలో సుభాష్ పాలేకర్ శిక్షణలో పాల్గొని పలు అంశాలు తెలుసుకున్నారు. అలాగే మహారాష్ట్రలో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న పంటలను ప్రత్యక్షంగా పరిశీలించి.. సాంప్రదాయ వ్యవసాయ పద్ధతుల్లో పంటల సాగుకు చేపట్టడం మొదలు పెట్టారు.

మండలంలోని కనుపర్తి గ్రామానికి చెందిన రైతు బాలచంద్రుడు బీఎస్సీ చదివారు. ఈయ న తండ్రి నుంచి సంక్రమించిన ఐదు ఎకరాల భూమిలో సంప్రదాయ వ్యవసాయ పద్ధతుల్లో పసుపు, వరి, టమోటా, మిరప, కాకర, నువ్వులు, వంకాయ, దోస వంటి పంటలు సాగు చేస్తున్నారు. ద్రవ జీవామృతం, పంచగవ్య, ఆవాల పిండి, సైంధవ లవణం లాంటివి పంటల సస్యరక్షణకు ఉపయో గిస్తూ.. మంచి దిగుబడులు సాధిస్తున్నారు. తోటి రైతులను ప్రకృతి వ్యవసాయం చేపట్టేలా ప్రోత్సాహస్తున్నారు. అంతేగా కుండా ప్రొద్దుటూరు, గుంతకల్లు, వరంగల్ తదితర ప్రాంతాలకు వెళుతూ రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగా హన కల్పిస్తు న్నారు. ఇక ఈ ఏడాది రిపబ్లి క్‌డే రోజున రైతు బాలచంద్రుడు తన ఉత్పత్తులను ప్రదర్శించడంతో కలెక్టరు చెరుకూరి శ్రీధర్, వ్యవసాయాధికారి నాగేశ్వర్‌రావు, జిల్లా ప్రాజెక్టు మేనేజరు ప్రవీణ్ కుమార్‌లు పరిశీలించి ప్రశంసించారు.


సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసిన పసుపు పంట కళకళలాడుతున్న దృశ్యం,

పసుపు పంట సాగులో...

గత ఏడాది 2 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరిస్తూ పసుపు పంట సాగు చేశాడు. రెండు ఎకరాల సాగుకు 2.7 లక్షలు పెట్టుబడి పెట్టి రూ.10 లక్షలపైన ఆదాయాన్ని సంపాదించాడు. ఇక ఆయన పండించిన పసుపు దేశంలోనే అత్యంత నాణ్యతగా ఉందని పలువురు శాస్త్రతవేత్తలు ప్రశంసించినట్లు తెలిపారు. ముఖ్యంగా మహారాష్టకు చెందిన ఓ సంస్థ 25 క్వింటాళ్ల పసుపు కొనుగోలుకు ముందస్తుగా ఆర్డరు ఇచ్చినట్లు రైతు తెలిపారు.

రసాయనాలతో భూమి నిస్సారం

రైతులు పంటల సాగులో విరివిగా రసాయనాలు వాడితే భూమి నిస్సారమవుతుందని.. ఇది భవిష్యత్తులో తీరని నష్టం కలిగిస్తుందని రైతు బాలచంద్రుడు అంటున్నారు. అంతేకాక తల్లి తన బిడ్డను కడుపులో 9 నెలలు మోస్తే... నేలతల్లి జీవితాంతం మోస్తుందని.. అందుకే ప్రతి రైతు భూమిని కాపాడుకోవాలని చెబుతున్నారు.

వైభవంగా లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవం



పెద్దమండ్యం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఏకశిలగుట్టపై మాండవ్య మహర్షిచే ప్రతిష్ఠితమైన లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవం మంగళవారం ఉదయం వేదపండితులు వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారి కల్యాణోత్సవానికి స్వామి వారు సహా శ్రీదేవి, భూదేవి ఉత్సవమూర్తులను ఆకర్షణీయంగా అలకరించి మేళాతాళాలు మంగళవాయిద్యాలతో మండపం వద్దకు తీసుకువెళ్లారు. వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ స్వామి వారి కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. అనంతరం లక్ష్మీ నరసింహస్వామి సమేతంగా రథంపై పురవీధుల్లో ఊరేగింపుగా వెళ్లారు. మంగళవారం రాత్రి స్వామి వారిని గుర్రపు వాహనంపై ఆధిరోహింప జేశారు. చాందినీ బండ్లు కట్టి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. కాగా అనివార్యకారణాలతో సోమవారం రాత్రి జరగాల్సిన పాపేపల్లి నరసింహస్వామి కల్యాణోత్సవం మంగళవారం ఉదయం జరిగినట్లు నిర్వాహకులు వెల్లడించారు. దేవస్థానం కార్యనిర్వాహణాధికారి మునిరాజ, మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉభయదారులు గాలివీడు ఎగవగొట్టివీడు, చిన్నమండ్యం పడమటికోన భక్తులు, గొల్లవానికుంట సుబ్బానాయుడు, గ్రామ పెద్దలు, అర్చకులు, వేదపండితులు విష్ణమాచార్యులు, రఘుమాచార్యులు, కృష్ణమాచార్యులు, రామమోహన్ పాల్గొన్నారు.

కోరిన కోరికలు తీర్చే దండుమారెమ్మ

- నేడు ముదివేడులో దండుమారెమ్మ జాతర



విద్యుత్ దీప అలకరణలో ఆలయం
(ఇన్‌సెట్‌లో)ప్రత్యేక అలంకరణలో దండుమారెమ్మ అమ్మవారు

కురబలకోట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): భక్తులు కోరిన కోరికలు తీర్చే దేవతగా ప్రసిద్ధి చెందిన దండుమారెమ్మ జాతరకు సర్వసిద్ధం చేశారు. ముదివేడులో వెలసిన దండుమారెమ్మ జాతరను ఏటా నిర్వహిస్తారు. మట్లివారిపల్లె, పిచ్చలవాండ్ల పల్లె, ముదివేడు ప్రజలు అమ్మవారిని ఆరాధ్యదైవంగా కొలుస్తారు. రెండు రోజులు నిర్వహించనున్న జాతరకు కులమతాలకీతంగా హిందూ, ముస్లింలు పాల్గొంటారు. కాగా బుధవారం రాత్రి జరిగే జాతరలో విద్యుత్ దీపాలతో అలంకరించిన చాందినీ బండ్లను ఊరేగిస్తారు. గురువారం పగలు తిరునాళ్ల నిర్వహిస్తారు. అమ్మవారికి భక్తులు దీలు, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లిస్తారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ముస్తాబు చేసి ప్రత్యేకంగా పూజలు నిర్వహిస్తారు. ఆల యాన్ని విద్యుత్ దీపాలతో ఆలంకరించి ముస్తాబు చేశారు. జాతరకు చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో జాతరలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముదివేడు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని టీడీపీ నేతల వినతి

వాల్మీకిపురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టాలని టీడీపీ మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్‌బాషా కోరారు. ప్రతి చోటా ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోవడంతో వాతావరణ కాలుష్యం పెరిగిపోతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పార్టీ నేలతో కలిసి తహసీల్దార్ పామిలేటి, ఎంపీడీఓ మనోహర్‌రాజుకు వినతిపత్రాలు అందజేసిన ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఏర్పాటు చేసిన ప్రతి టిఫెన్ సెంటర్లు, హోటళ్లలో ఎటు చూసినా ప్లాస్టిక్ వాడకం తీవ్రమైందన్నారు. టిఫెన్ సెంటర్లలో ఇడ్లీ, సాంబార్‌కు ప్లాస్టిక్ కవర్లు వాడకం, చిల్లర దుకాణాల్లో కూడా ప్లాస్టిక్ కవర్ల వాడకం ఎక్కువైందన్నారు. కార్యక్రమంలో నేతలు కువైట్ సయ్యద్‌బాషా, డిష్ బ్రదర్స్ పీర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

పనుల ముసుగులో ఇసుక దందా

హంద్రీ-నీవా పనుల కాంట్రాక్టర్లతో కుమ్మక్కు


- అధికార పార్టీ అంటూ కొందరు, పాతపరిచయాలతో వైసీపీ నేతలు ?
- రూ. లక్షలు ఆర్జిస్తున్న చోటా నేతలు



బి.కొత్తకోట మండలంలో జరుగుతున్న హంద్రీనీవా లైనింగ్ పనులు

బి.కొత్తకోట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా పనుల ముసుగులో బి.కొత్తకోట, పీటీఎం మండలాల్లో ఇసుక దందా జోరుగా సాగుతోంది. చెట్టు పేరు చెప్పుకొని కాయలు అమ్ముకునే చందంగా అధికార పార్టీ నేతలమని కొంద రు, వైసీపీ నేతలుగా పాత పరిచయాలతో మరికొందరు రోజుకు వందల ట్రాక్టర్లు, టిప్పర్లతో ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అడ్డుకట్ట వేయాల్సిన రెవెన్యూ, మైన్స్ అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తుండడంతో ఏ మాత్రం అవకాశం ఉన్నా, ఇదే అదునుగా భావించి కాల్వ పనులకనే పేరుతో ప్రైవేటు పనులకు ఇసుకను యథేచ్ఛగా తరలించేస్తున్నారు. హంద్రీ-నీవా సుజల స్రవంతి ప్రాజెక్టులో భాగంగా అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో ప్రవహించే పుంగనూరు బ్రాంచి కెనాల్‌కు 133 కి.మీటర్ల మేర సిమెంట్ లైనింగ్ పనులకు ప్రభుత్వం రూ.483కోట్లు కేటాయించింది. పనులు దక్కించుకున్న నిర్మాణసంస్థ 15రోజులుగా పనులు ప్రారంభించింది. కాల్వ ఉపరితలం 14.25 మీటర్లు, అడుగుభాగం 6మీటర్ల వెడల్పుతో సిమెంట్ లైనింగ్ పనులు శరవేగంగా చేస్తున్నారు. అయితే అవసరమైన కంకర, సిమెంటుకు కొరత లేక పోగా ఇసుక కోసం కాంట్రాక్టర్ సంస్థ ప్రతినిధులు స్థానిక నేతలు, దళారులను ఆశ్రయిస్తున్నారు. దీంతో సంపాదన కోసం పలు రకాలుగా నేతలు హవా నడుపుతున్నారు. పీటీఎం మండలం బూర్లపల్లె, మల్లెల, టి.సదుం, బి.కొత్తకోట మండలం బడికాయలపల్లె, గట్టు, బీరంగి తదితర ప్రాంతాలనుంచి ట్రాక్టర్లు, టిప్పర్లతో ఇసుక తరలిస్తున్నారు. సొంతంగా వాహనాలు లేని వ్యక్తులు సైతం బినామీలను పురమాయించి ఎవరైనా ఆపితే తన పేరు చెప్పాలని తరలింపులో పర్సెంటేజీ తీసుకోవడం, వాహనాలను లీజుకు తీసుకుని తరలిస్తున్నారు. అడ్డుపడిన రెవెన్యూ అధికారులను బెదిరిస్తూ దందా నడుపుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఇసుక మేటలు వున్న డీకేటీ భూముల పట్టాలున్న వారు తమ భూమిలో ఇసుక ఎత్తాలంటే ట్రాక్టర్‌కు రూ.2000 కట్టాలని వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. వాల్టా చట్టం ప్రకారం తవ్వి ఇసుక తరలించడానికి వీల్లేకున్నా అధికారులను మేనేజ్ చేసుకుని ఇసుక దందాను కొనసాగిస్తున్నారు. ఇలా అధికారులు, చోటా నేతలు, దళారులు, డీకేటీ పట్టాదారులు రూ.లక్షలతో జేబులు నింపుకొంటున్నట్లు సమాచారం.

కాల్వ పనుల కోసం డంప్ నుంచి తరలిస్తున్న ఇసుక



లైనింగ్ పనులు పూర్తి అయిన హంద్రీ-నీవా కాల్వ



సాదాసీదాగా సామాజిక తనిఖీ

- ముగింపు సభపై ఆసక్తి చూపని రైతులు, కూలీలు
- ఉపాధి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో నిండిన కుర్చీలు
- రూ.40 వేల రికవరీకి ఆదేశించిన డ్వామా పీడీ



సభలో సిబ్బందిని ప్రశ్నిస్తున్న డ్వామా పీడీ వెంకటరత్నం

పీలేరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి పనులపై మంగళవారం జరిగిన సామాజిక తనిఖీ బహిరంగ సభ సాదాసీదాగా ముగిసింది. 2023-25 ఆర్థిక సంవత్సరంలో వైసీపీ నేతలు, కార్యకర్తలు పనులు చేసుకోవడం, వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేసిన సిబ్బంది ప్రస్తుతం విధుల్లో లేకపోవడం, బహిరంగ సభకు హాజరై అభ్యంతరాలు తెలిపేందుకు రైతులు, కూలీలు ఆసక్తి చూపకపోవడంతో తనిఖీ సభ ప్రశాంతంగా ముగిసింది. డ్వామా పీడీ వెంకటరత్నం ఆధ్వర్యంలో జరిగిన సభలో 15 పంచాయతీల్లో ఉపాధి నిధుల ద్వారా ఉపాధి, పంచాయతీరాజ్, హౌసింగ్, సర్వశిక్ష అభియాన్ శాఖల ద్వారా ద్వారా 3721 పనులు జరిగాయని అధికారులు తెలిపారు. రూ.8,54,83,705 వాటి కోసం ఖర్చు చేయగా వేతనాల ద్వారా రూ.5,75,53,958లు, మెటీరియల్ కాంపోనెంట్స్ కోసం రూ.2,79,29,747 వినియోగించినట్లు పీడీ తెలియజేశారు. వీటిపై తనిఖీ బృంద సభ్యులు క్షేత్రస్థాయిలో పరిశీలించారన్నారు.

ఆసక్తి చూపని రైతులు, హాజరు కాని పాత ఉద్యోగులు

2023-25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులు కావడంతో అవన్నీ వైసీపీ నేతల కనుసన్నల్లో జరిగాయి. ప్రభుత్వం మారిన నేపథ్యంలో తాము బహిరంగ సభకు వెళితే అనవసరంగా అధికార పార్టీ నేతల కళ్లల్లో పడతామన్న ముందు జాగ్రత్తతో వైసీపీ నేతలెవరూ బహిరంగ సభకు హాజరు కాలేదు. ప్రభుత్వం ఏర్పడిన తరువాత చాలా మంది ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించడంతో ఆ సమయంలో పనిచేసిన ఉద్యోగులు మంగళవారం జరిగిన సభకు గైర్హాజరయ్యారు. దీంతో చేసేది లేక అధికారులు విచారణను మమ అనిపించి నామమాత్రపు జరిమానాలు, రికవరీలతో ముగించారు. ప్రస్తుత సిబ్బంది, సామాజిక తనిఖీ బృందాలు అప్పట్లో పనులు చేసిన వారి వద్ద మామూళ్లు వసూలు చేశారనే వదంతులు కూడా వినిపించాయి.

మామూళ్లు ఇచ్చేశాం కనుక ఆ తిప్పలేవో అధికారులే పడతారులే అన్న ధైర్యంతోనూ వైసీపీ నేతలు, రైతులు, కూలీలు సభకు హాజరు కాలేదని గుసగుసలు వినిపించాయి. కార్యక్రమంలో ఎంపీడీఓ శివశంకర్, ఏపీడీ శ్రీనివాసులు, ఎస్ఆర్‌పీ ముర్తాద్, ఏపీఓలు మహేశ్, అశోక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు పెద్దచెరువు వేలం

పెద్దతిప్పసముద్రం మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రంగసముద్రం పెద్దచెరువు గురువారం వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి సురేఖ తెలిపారు. గతేడాది చెరువు చేపల వే లం ద్వారా బి.కొత్తకోట వాసికి కేటాయించారు. వారి సమయం అయిపోవడంతో తిరిగి వేలం వేస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. తిరిగి ఈ వేలం 20వ తేదీన ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. వేలంలో పాల్గొనే వారు బుధవారం సాయంత్రం 5 గంటల లోపు ధరావత్తుగా రూ.87,500 చెల్లించి రసీదు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి తెలిపారు. వివరాలకు స్థానిక పంచాయతీ సచివాలయంలో సంప్రదించాలని ఆమె కోరారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి : ఏఈ



గ్రామసభలో మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ రాజేశ్వరి

రామసముద్రం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): హౌసింగ్ లబ్ధిదారులకు ప్రభుత్వం ఆర్థిక సాయం పెంచిన దృష్ట్యా ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ రాజేశ్వరి కోరారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం కోసం మండల కేంద్రం, మినికి, కురిజల, మాలేనత్తం, కాప్పల్లె, చెంబకూరు, రాగిమాకులపల్లె, మూగవాడి, పంచాయతీల్లో సర్పంచుల అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. రాజేశ్వరి మాట్లాడుతూ లబ్ధిదారులకు అదనంగా బీసీ, ఎస్సీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు సహాయం అందిస్తుందని, సదావకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామ సభలకు ఆయా సర్పంచులు, ప్రభుత్వ అధికారులు ఎస్‌ఏ గఫూర్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, హౌసింగ్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

మృతదేహాల పరిశీలన



మృతదేహాలను పరిశీలిస్తున్న చినబాబు, శివప్రసాద్

మదనపల్లె అర్బన్, మార్చి 18 (ఆంధ్ర జ్యోతి): ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మరణించిన పీటీఎం మండలం వాసులు చందు, శ్రీను కుటుంబ సభ్యులను తెలుగు యువత రాష్ట్రఅధ్యక్షుడు శ్రీరాంచినబాబు, బాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పీటీఎం శివప్రసాద్ పరామర్శించారు. మంగళవారం వారు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ వద్ద మృతదేహాలను పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులకు సానుభూతి తెలుపుతూ ప్రగాఢ సంతాపం తెలిపారు. పార్లమెంట్ జనరల్ సెక్రటరీ దొరస్వామినాయుడు, తెలుగు యువత నేత అంజి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాలు వికాస్‌కు సన్మానం



వికాస్‌ను సన్మానిస్తున్న మాధవి, ఎంఈఓ

పీలేరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఇటీవల వెలువడిన ఎస్ఎస్‌సీ సీజీఎల్-2024 పరీక్షల ఫలితాల్లో జీఎస్‌టీ ఇన్‌స్పెక్టరుగా ఉద్యోగం సాధించిన జొన్నగడ్డల బాలు వికాస్‌కు ఆయన చదివిన వీఎస్ఎన్ పాఠశాల సన్మానించింది. బాలు వికాస్ పీలేరులోని వీఎస్ఎన్ సిద్దార్థ పాఠశాలలో టెన్త్ వరకు చదువుకున్నాడు. జాతీయ స్థాయిలో 1173 ర్యాంకు సాధించి కేంద్ర ఆర్థిక శాఖ పరిధిలోని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టరుగా ఉద్యోగం సాధించిన నేపథ్యంలో మంగళవారం వీఎస్ఎన్ సిద్దార్థ విద్యాసంస్థల అధినేత్రి వడ్డమూడి మాధవి ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయులు బాలు వికాస్‌ను సన్మానించారు. ఎంఈఓ లోకేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగమే ఉత్తమం

మదనపల్లె టౌన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కన్నా భారత రాజ్యాంగమే ఉత్తమమని మాలమహానాడు రాయలసీమ కార్యదర్శి యమలా చంద్రయ్య అన్నారు. స్థానిక సబ్‌కలెక్టరేట్ ఎదుట మాలమహానాడు ఆధ్వర్యంలో వర్గీకరణను తప్పుపడుతూ ధర్నా నిర్వహించారు. వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగానికి వ్యతిరేకంగా వుందని, కొందరు రాజకీయ నేతలు వారి లబ్ధికోసం అన్నదమ్ములాంటి మాల, మాదిగలను వేరుచేయడం శోచనీయమన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు మనోహర్, మాణిక్యం, లక్ష్మీపతి, రామచంద్ర ప్రశాంత్, అమర పాల్గొన్నారు.

టీకాల లక్ష్యాన్ని పూర్తి చేయాలి

వాల్మీకిపురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): వంద శాతం టీకాల లక్ష్యాన్ని పూర్తి చేయాలని వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉషశ్రీ పేర్కొన్నారు. చింతపర్తి పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీలో ఆమె రికార్డులు పరిశీలించి వైద్య సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా పనిచేయాలన్నారు. డాక్టర్ సనాఆయేషా, సూపర్‌వైజర్ సుధాకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణ కుటుంబాన్ని ఆదుకోవడం బాధ్యత

- రూ.50వేల విరాళాలు అందించిన టీడీపీ నేతలు



రామకృష్ణ కుమారుడికి ఆర్థిక సహాయం అందిస్తున్న ఆర్‌జే వెంకటేశ్

మదనపల్లె టౌన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రామకృష్ణ కుటుంబీకులకు టీడీపీ నేతలు విరాళాలు అందించారు. ప్రస్తుతానికి రూ. 50 వేలు వచ్చిందని, మరో రెండు రోజుల్లో మరో రూ.లక్ష సేకరించి రామకృష్ణ కుటుంబీకులకు అందజేస్తామని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ పేర్కొన్నారు. పెద్దిరెడ్డి వర్గీయుడైన వైసీపీ నేత వెంకటరమణ చేతిలో రామకృష్ణ హత్యకు గురైనా మాజీ ఎమ్మెల్యే దేశాయ్‌తిప్పారెడ్డి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డిని వెనకేసుకొస్తూ స్టేట్‌మెంట్లు ఇవ్వడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా పెద్దిరెడ్డి తన వర్గీయులను అదుపులో పెట్టుకోవాలని లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వుంటుందని హెచ్చరించారు. టీడీపీ నేతలు రాటకొండ మధుబాబు, పి.సతీష్‌కుమార్, బి.రాజన్న, వెంకట్రమణ, చంద్రారెడ్డి, రమేశ్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న గడ్డితో పాల ఉత్పత్తి పెరుగుదల



రైతులకు సబ్సిడీ మొక్కజొన్న గడ్డి విత్తనాలను అందచేస్తున్న ఏడీ సుమిత్ర

తంబళ్లపల్లె, మార్చి 18(ఆంధ్ర జ్యోతి): పశువులకు మొక్కజొన్న గడ్డితో పాల ఉత్పత్తి పెరుగుతుందని తంబళ్లపల్లె పశుసంవర్ధక శాఖ ఏడీ సుమిత్ర సూచించారు. స్థానిక పశువైద్యశాలలో ప్రభుత్వం 75 శాతం సబ్సిడీతో అందిస్తున్న మొక్కజొన్న గడ్డి విత్తనాలను పాడి రైతులకు పంపిణీ చేసిన ఆమె మాట్లాడుతూ తంబళ్లపల్లె, పెద్దమండ్యం మండలాలకు 16 టన్నులు సబ్సిడీ మొక్కజొన్న గడ్డి విత్తనాలు వచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వ సబ్సిడీ పోను రైతులు ఒక్కో బ్యాగు(5కిలోలు)కు రూ.85లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఒక్కో రైతుకు పొలాన్ని బట్టి 20 కిలోల నుంచి 40 కిలోల వరకు విత్తనాలు ఇస్తామన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు భూమి పాసుపుస్తకం, ఆధార్ జిరాక్స్ కాపీలతో సంబంధిత కార్యాలయాల్లో పొందవచ్చన్నారు. పశు వైద్యులు ఇందు, ఎల్ఎస్‌ఏ నాగేంద్ర సిబ్బంది రమణ, శివానాయక్, సురేష్ బాబు, రైతులు పాల్గొన్నారు.

సబ్సిడీ పశుగ్రాస విత్తనాలు పంపిణీ

పెద్దమండ్యం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీ పశుగ్రాస విత్తనాలు పంపిణీ జరుగుతున్నాయని వెలిగల్లు పశు వైద్యాధికారి విక్రమ్‌రెడ్డి వెల్లడించారు. మంగళవారం వెలిగల్లులో మొక్కజొన్న పశుగ్రాస సబ్సిడీ విత్తనాలు రైతులకు పంపిణీ చేశారు. ఈ అవకాశం రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పంచాయతీ కార్యాలయానికి టీడీపీ నేతల వితరణ

పీలేరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యాలయానికి టీడీపీ నేతలు పురం రామ్మూర్తి, పోలిశెట్టి సురేంద్ర ఒక ఏసీ, బీరువాను వితరణగా అందజేశారు. కార్యాలయంలో మంగళవారం వాటిని పంచాయతీ ఈఓ గురుమోహన్‌కు అందించారు. వారు మాట్లాడుతూ వివిధ పనుల కోసం పంచాయతీ కార్యాలయానికి వచ్చే ప్రజల కోసం కార్యాలయంలో ఏసీ ఏర్పాటు చేశామని, కార్యాలయ రికార్డుల భద్రత కోసం బీరువా అందించినట్లు వివరించారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో భోజనం వడ్డిస్తున్న కార్పెంటర్స్ అసోసియేషన్ నేతలు

పీలేరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పవిత్ర రమజాన్ మాసం సందర్భంగా మంగళవారం పీలేరులోని ముస్లింలకు స్థానిక కార్పెంటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డిబాబు, అంబికాపతి మాట్లాడుతూ తమ అసోసియేషన్‌లోని ముస్లింలు, పట్టణంలోని వారికి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశామన్నారు. చిత్తూరు రోడ్డులోని మసీదు వద్ద ఏర్పాటు చేసిన విందులో ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అసోసియేషన్ సభ్యులు వేణు ఆచారి, మహబూబ్ బాషా, ఫారుఖ్, మోదిన్ బాషా, గౌస్‌పీర్, మునిరాజు, కృష్ణమాచారి, సురేశ్ ఆచారి, రమేశ్, గంగాధర్, మధు పాల్గొన్నారు.

విచారణ చేపట్టి చర్యలు తీసుకోండి

ప్రజా సంఘాల ధర్నా

ములకలచెరువు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో జరుగుతున్న సంఘటనలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లికార్జున డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట మంగళవారం ప్రజా సంఘాల నేతలు నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో పిల్లల సంక్షేమాన్ని గాలికొదిలేసి వ్యక్తిగత వ్యాపారాలు చేస్తూ నిర్లక్ష్యం వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎంఈఓ వెంకటరమణకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సోము, రమణ, శివకుమార్, మల్లప్ప తదితరులు పాల్గొన్నారు